PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 23 | విజయవాడ, శనివారం 23 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 23 August 2025 | Rs

భారత వృద్ధికి గ్లోబల్ సవాళ్లు

- ఈ ఏడాది జిడిపి 6.3 శాతమే
- ఎస్‌బిఐ రీసెర్చ్ రిపోర్ట్
- ఆర్‌బిఐ అంచనాల కంటే తక్కువ

3

ఫైనల్‌కు తుంగభద్ర వారియర్స్

- క్వాలిఫయర్-2లో ఓడిన భీమవరం బుల్స్
- నేడు టైటిల్ పోరు

8



సురవరం కన్నుమూత



వామపక్ష శ్రేణుల దిగ్భ్రాంతి
రేపు మఖ్దూం భవన్‌కు భౌతిక కాయం
అనంతరం గాంధీ వైద్యకళాశాలకు అప్పగింత

హైదరాబాద్ : సిపిఐ సీనియర్ నేత, అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సురవరం సుధాకర్ రెడ్డి (83) కన్నుమూశారు. అనారోగ్యంతో హైదరాబాద్ గచ్చిబౌళిలోని కేర్ ఆసుపత్రిలో కొద్దిరోజులుగా చికిత్సపొందుతున్న ఆయన శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లి గ్రామంలో 1942 మార్చి 25న జన్మించిన ఆయన జీవితాంతం వామపక్ష రాజకీయాలకు, పేద ప్రజల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారు. సురవరం మరణవార్త తెలియడంతో దేశ వ్యాప్తంగా వామపక్షశ్రేణులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. పలువురు నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. సిపిఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి డి.రాజా సురవరం మృతిని తీరని లోటని పేర్కొన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సిపిఐ శ్రేణులకు, సురవం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. విషయం తెలిసిన వెంటనే సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు ఇతర నేతలు ఆస్పత్రికి చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్, సిపిఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, తదితరులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సురవరం జీవితాంతం వామపక్ష ఐక్యతకు కృషి చేశారని వి.శ్రీనివాసరావు నివాళు లర్పించారు. సురవరం మరణ వార్త తెలియడంతో సిపిఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి వద్దకు చేరుకుంటున్నారు. సురవరం భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్థం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం (మఖ్దూం భవన్)కు ఆదివారం తరలించనున్నారు. సురవరం కుమారుడు నిఖిల్ అమెరికా నుంచి రావాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిపిఐ వర్గాలు తెలిపాయి. అప్పటి వరకూ ఆయన భౌతికకాయాన్ని ఆస్పత్రిలోనే ఉంచనున్నారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ మఖ్దూం భవన్‌లో ప్రజాసందర్శనార్థం సురవరం భౌతికకాయాన్ని ఉంచనున్నారు. అంతిమనివాళులర్పించిన అనంతరం వైద్య పరిశోధనల నిమిత్తం గాంధీ వైద్య కళాశాలకు భౌతిక కాయాన్ని అప్పగించనున్నారు.

ఇదీ జీవితపథం....

సురవరం సుధాకర్‌రెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్నారు. సుధాకర్‌రెడ్డి 1974లో విజయలక్ష్మిని వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు. కర్నూలులోని ఉస్మానియా కళాశాల నుంచి బిఎ చేశారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బి పట్టాపొందారు. 1998, 2004లో జరిగిన ఎన్నికల్లో నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2012 నుంచి 2019వరకు ఆయన సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదవిలో కొనసాగారు. 1998, 2004 లోక్‌సభ ఎన్నికల్లో నల్గొండ పార్లమెంట్ స్థానం నుంచి ఎన్నికయ్యారు. ఎఐఎస్ఎఫ్ నుంచి ప్రారంభమైన ఆయన ప్రస్థానం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు సాగింది.

పాఠశాల స్థాయి నుంచే పోరాటం..

1968లో ఎల్ఎల్ఎమ్‌లో చేరినప్పటికీ విద్యార్థి నాయకుడిగా కొనసాగడంతో దాన్ని పూర్తి చేయలేకపోయారు. సురవరం సుధాకర్‌రెడ్డి 1957లో కర్నూలు చదువుతున్న సమయంలో పాఠశాలల్లో బ్లాక్ బోర్డ్స్, చాక్‌పీస్, ప్రాథమిక అవసరాల కోసం ఆయన ఆందోళన చేపట్టారు. ఇది కర్నూలులోని మిగతా 7లో

రూ.5వేల కోట్లు ఇవ్వండి

కేంద్ర ఆర్థికశాఖమంత్రికి చంద్రబాబు విజ్ఞప్తి
16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ పనగారియాతో భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్టిమెంట్-సాస్కి) పథకంలో భాగంగా రాష్ట్రానికి 5వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆయన శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టుల గురించి కేంద్రమంత్రితో సిఎం చర్చించారు. సాస్కి పథకం కింద రాష్ట్రానికి ఇప్పటికే 2,010 కోట్ల రూపాయలు ఇచ్చారని, అదనంగా మరో ఐదు వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ ప్రోత్సాహక పథకంలో భాగంగా రాష్ట్రానికి 250 కోట్ల రూపాయలు రావాల్సిఉందని చెప్పారు. ఆ పథకం మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదల కోరుతూ ఇప్పటికే ప్రతిపాదనలు పంపిందని ఆయన ఆర్థికశాఖ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆ ప్రతిపాదనలపైన ఉత్తర్వులను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని కోరారు. తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందుతుం దని అన్నారు. ఈ పథకం విధివిధానాలను సాధ్యమైనంత త్వరగా రూపొందించి అమలులోకి తీసుకురావాలన్నారు. అనంతరం 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియాతో భేటీ అయిన చంద్రబాబు, రాష్ట్రానికి సంబంధించిన విజ్ఞప్తులను అందజేశారు. 16వ ఆర్థిక సంఘం సిఫా ర్సుల్లో తమ రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

1991 ఆర్థిక సంస్కరణలే కీలకం ...

దేశాభివృద్ధికి 1991 ఆర్థిక సంస్కరణలే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఎకనామిక్స్ టైమ్స్ నిర్వహించిన వరల్డ్ లీడర్స్ ఫోరం కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ 1991లో భారత్ ఆర్థిక సంస్కరణలు చేసిందని అన్నారు. ఆ తరువాత 1995లో సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవం వచ్చిందన్నారు. వీటివల్ల భారతీయులు, అందులోనూ ఆంధ్రప్రదేశ్ యువతకు అవకాశాలు లభించాయని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన తరువాత, 1995లో తాను మొదటి సారి ముఖ్యమంత్రి అయిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. తాను ఐటిని ప్రమోట్ చేశానని, అప్పుడు ఐటి గురించి ఎవరికి అంతగా తెలియదని అన్నారు. 2047 నాటికి దేశం, దేశ ప్రజలు ప్రపంచంలోనే నెంబర్ 1గా నిలుస్తారని పేర్కొన్నారు. అమరావతిలో క్వాంటాం వ్యాలీని ప్రారంభించామని, జనవరిలో మొదటి క్వాంటాం కంప్యూటర్ పని చేస్తుందని తెలిపారు.

రాధాకృష్ణన్‌తో భేటీ

ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌తో చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ దేశం గౌరవించదగిన వ్యక్తి రాధాకృష్ణన్ అని అన్నారు. ఎన్నికల ముందు నుంచి ఎన్‌డిఎలో టిడిపి ఉందని, కాబట్టే ఎన్‌డిఎ అభ్యర్థికే తమ మద్దతు అని స్పష్టం చేశారు. తాము ఎన్‌డిఎలో ఉన్నప్పుడు ప్రతిపక్ష అభ్యర్థికి ఎలా మద్దతు ఇస్తామని ప్రశ్నించారు. తెలుగువారు అన్నప్పుడు గెలిచే అవకాశం ఉంటేనే అభ్యర్థిని పెట్టాలని, గెలిచే అవకాశం లేకపోయినా అభ్యర్థిని పెట్టి ఇండియా ఫోరమ్ రాజకీయం చేస్తోందని విమర్శించారు. రాధాకృష్ణన్‌ను కలిసిన వారిలో కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి ఎంపిలు లావు శ్రీకృష్ణదేవ రాయులు, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూమి పరిరక్షణకు

ప్రత్యేక చట్టం

సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాలా చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వ్యవసాయ భూమి పరిరక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలతో చర్చించిన అనంతరమే నాలా రద్దు అమలు చేయాలని ఈ ప్రకటనలో ఆయన కోరారు. రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం నాలా రద్దు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఇప్పటికే కార్పొరేట్ల కోసం రాష్ట్రంలో విచ్చలవిడిగా భూ సేకరణ జరుగుతోందని, వ్యవసాయయోగ్యమైన భూములను కంపెనీలకు అప్పగిస్తున్న ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా వివిధ ప్రాంతాల్లో రైతులు ఉద్యమిస్తున్నారని పేర్కొన్నారు. వారి అభిప్రాయాలకు భిన్నంగా నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్ యాక్టు(నాలా) 2006 చట్టాన్ని రద్దు చేస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం 2020లో సగం ఊపిరితీయగా మిగతాది ఈ ప్రభుత్వం తీసేసిందని వ్యాఖ్యానించారు. దీంతో వ్యవసాయ భూమిని రక్షించాలనే లక్ష్యం దెబ్బతిందని వివరించారు. వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు సులభంగా అప్పగించేందుకే ఈ చట్టాన్ని రద్దు చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం, రైతుల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే వ్యవసాయ భూముల పరిరక్షణకు చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

ప్రతి సంవత్సరం సాగుభూమి విస్తీర్ణం, ఆహార పంటల సాగు తగ్గిపోతున్న స్థితిలో వ్యవసాయ భూములను కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ల్యాండ్ యూజ్ పాలసీని రూపొందించాలని కోరారు. ఏ రకం భూములను ఎందుకోసం వినియోగించాలన్న దానిపై స్పష్టమైన ప్రభుత్వ విధానం ఉండాలని, వాటిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా నిబంధనలు మిగతా 7లో



గోదావరి తగ్గుముఖం

- ధవళేశ్వరం వద్ద 14.30 అడుగుల ప్రవాహం
- కోనసీమలో నీట మునిగిన, కొట్టుకుపోయిన కాజ్‌వేలు
- పునరావాస గ్రామాలకు లంక ప్రజలు

2

ప్రతి ఏటా టీచర్ పోస్టుల భర్తీ

- తల్లికి వందనం చివరి దశ నిధుల విడుదల సమీక్షలో మంత్రి లోకేష్

2

'వారిని' అరెస్ట్ చేయవద్దు!

- సుప్రీంకోర్టు ఆదేశం
- సిద్ధార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌కు ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి నేత ఫిర్యాదు మేరకు అస్సాం పోలీసులు నమోదు చేసిన దేశ ద్రోహం కేసులో సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ్ వరద రాజన్, కరణ్ థాపర్‌లను అరెస్ట్ చేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 'ది వైర్' ప్రచురితమైన ఒక కథనంపై స్థానిక బిజెపి నేత చేసిన ఫిర్యాదు మేరకు అస్సాం పోలీసులు ఈ కేసును నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు జారీ చేసిన సమన్లను సవాలు చేస్తూ వరదరాజన్, కరణ్ థాపర్ దాఖలు చేసిన పిటిషన్ ద్వి సభ్య ధర్మాసనం ముందుకు శుక్రవాంర వచ్చింది. దీనిపై విచారణ జరిపిన బెంచ్ అరెస్టుల నుంచి వారికి రక్షణ కల్పించింది. అస్సాం పోలీసులు ఎటువంటి బలప్రయోగపు చర్యలు తీసుకోకూడదని ఆదేశించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది నిత్య రామకృష్ణన్ వాదనలు వినిపిస్తూ ఎఫ్ఐఆర్ మే నెల నాటిదని, మరొక కేసులో సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన వెంటనే దీనిని ముందుకు తీసుకువచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తోందని, దీంతో అరెస్ట్ చేస్తారన్న ఆందోళన నెలకొందన్నారు. అదే సమయంలో వారిపై నమోదైన కేసుల దర్యాప్తుకు సహకరించాల్నఇ పిటిషన్ దారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ 15కి ధర్మాసనం వాయిదా వేసింది.



శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘే అరెస్ట్

కొలంబో : శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘేను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించి తీవ్రమైన ఆరోపణలు రావడంతో శ్రీలంక సిఐడి శుక్రవారం ఉదయం ఆయనను అరెస్టు చేసింది. 2023 సెప్టెంబర్‌లో విక్రమ్ సింఘే తన భార్యతో కలిసి లండన్‌లోని ఓ విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు. ఈ పర్యటన అధికారికంగా చేపట్టింది కాదని అప్పట్లో విక్రమ్‌సింఘే ప్రకటించినప్పటికీ, ప్రభుత్వ నిధులను వినియోగించారు. ఆయనను ఫైనాన్షియల్ క్రైమ్ ఇన్వెస్ట్‌మెంట్ డిపార్ట్‌మెంట్ విచారించి, కొలంబో పోర్ట్ మేజిస్ట్రేట్ ఎదుట శుక్రవారం హాజరుపర్చింది. హవానాలో జి - 77 సదస్సుకు హాజరై తిరిగివస్తూ లండన్ వెళ్లానని, తన భార్య ఖర్చులను ఆమే పెట్టుకుందని విక్రమ్‌సింఘే చెబుతున్నారు. ఈ పర్యటనకు, తన సెక్యూరిటీ సిబ్బందికి కూడా ప్రభుత్వ నిధులే వెచ్చించారని సిఐడి చెబుతోంది. ఆర్థిక సంక్షోభం కారణంగా చెలరేగిన దేశవ్యాప్త నిరసనల తర్వాత మాజీ అధ్యక్షుడు గొటబయ రాజపక్సే పదవి నుండి వైదొలిగిన సంగతి తెలిసిందే. అనంతరం 2022 జులైలో జరిగిన అత్యవసర పార్లమెంటరీ ఓటింగ్‌లో విక్రమ్‌సింఘే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు.

మద్యం కేసులో సిట్‌కు నోటీసులు


ప్రజాశక్తి, అమరావతి

మద్యం కేసులో దర్యాప్తు వివరాలను మీడియాకు లీక్ చేస్తున్నారనే కేసులో కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 2కి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. లీక్‌లపై స్వంత్రంగా విచారణకు ఆదేశించాలంటూ నిందితుడు చెరుకూరు వెంకటేష్ నాయుడు భార్య వాసిరెడ్డి మహిత దాఖలు చేసిన పిటిషన్‌పై దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

నారాయణస్వామిని విచారించిన సిట్

- ఇంట్లోకి రానివ్వకపోవడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ

2



మేయర్ పోడియం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం కార్పొరేటర్, వైసిపి నేతలు

'ఉక్కు'పై స్తంభించిన జివిఎంసి కౌన్సిల్

- ఏడు తీర్మానాలకు ఏకగ్రీవం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై జివిఎంసి కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్తంభించింది. ఉక్కు అంశం అజెండాగానే మూడు గంటలకుపైగా చర్చ సాగింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని 46 ముక్కలు చేసి కాంట్రాక్టర్లకు ఇవ్వాలన్న విధానాన్ని తిరస్కరించాలని, ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై కౌన్సిల్ ఏకమొత్తంగా నిరసన గళమెత్తాలని, కేంద్రం ప్రకటించిన వంద శాతం వ్యూహాత్మక అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కౌన్సిల్‌లో తొలుత గళమెత్తారు. నల్లదుస్తులతో అడుగుపెట్టిన వైసిపి కార్పొరేటర్లు కూడా నినాదాలు అందుకున్నారు. టిడిపి, జనసేన కార్పొరేటర్లు స్టీల్‌ప్లాంట్‌పై చర్చను అడ్డుకునే ప్రయత్నం చేసినా ఒక్కసారిగా విపక్ష కార్పొరేటర్లంతా మేయర్ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. 'మీకేం కావాలో కాగితంపై రాసి వివరంగా ఇవ్వండి.. తర్వాత చర్చిద్దాం' అంటూ ఐదు నిమిషాల వ్యవధి ఇచ్చి కౌన్సిల్‌ను వాయిదా వేశారు. తుదకు విశాఖ ఉక్కును రక్షించుకోవడానికి జివిఎంసి కౌన్సిల్‌లో ఏడు తీర్మానాలను ఏకగ్రీవంగా మిగతా 7లో

గాజాలో క్షామం

- ఇజ్రాయిల్ దాష్టీకంతో ఐదు లక్షల మందికి ఆహారం కరువు
- పశ్చిమాసియాలో ఇదే మొదటిది
- అధికారికంగా ఐరాస ప్రకటన
- పూర్తిగా నివారించదగినదని స్పష్టీకరణ



దక్షిణ గాజా స్ట్రిప్ ఖాన్ యూనిస్ చారిటీ కిచెన్ వద్ద ఆహారం కోసం వేచివున్న పాలస్తీనా వాసులు

రోమ్, జెరూసలేం : ఇజ్రాయిల్ అమానుష దాడులను ఎదుర్కొంటున్న గాజాలో 'క్షామం' నెలకొందని ఐక్యరాజ్యసమితి అధికారికంగా ప్రకటించింది. మధ్యప్రాచ్యంలోనే ఇది మొదటిదని, సుమారు ఐదు లక్షల మంది ప్రజలు తీవ్రమైన ఆకలితో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని నిపుణులు తెలిపారు. ఈ కరువు పూర్తిగా నివారించదగినదని ఐరాస సహాయ చీఫ్ టామ్ ఫ్లెచర్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ క్రమబద్ధమైన అడ్డంకుల కారణంగా పాలస్తీనా భూభాగానికి ఆహారం చేరుకోలేకపోయిందని చెప్పారు. యుద్ధంలో ఆకలిని ఆయుధంగా ఉపయోగించడం యుద్ధ నేరమని ఐరాస మానవ హక్కుల అధికారి వోల్కర్ టర్క్ విమర్శించారు. పాలస్తీనా భూభాగంలో క్షీణిస్తున్న మానవతా పరిస్థితి గురించి యుఎన్ సంస్థలు గత కొంతకాలంగా హెచ్చరిస్తూనే ఉన్నాయి. "ఆగస్ట్ 15 నాటికి గాజా గవర్నరేట్‌లో కరువు (ఐపిసి ఫేస్-5) ఉందని తగిన ఆధారాలతో నిర్ధారించబడింది" అని రోమ్ ఆధారిత యుఎన్ సంస్థ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేస్ క్లాసిఫికేషన్ (ఐపిసి) శుక్రవారం విడుదల చేసిన తాజా అప్‌డేట్‌లో పేర్కొంది. గాజాస్ట్రిప్‌లో గాజా నగరం సుమారు 20శాతం విస్తరించి ఉంది. సెప్టెంబర్ చివరి నాటికి కరువు డెయిర్ ఎల్- బాలా, ఖాన్ యూనిస్ గవర్నరేట్లకు కూడా విస్తరిస్తుందని అంచనా వేసింది. ఇది పాలస్తీనా భూభాగంలో మూడింట రెండువంతుల వరకు ఉంటుంది. 22 నెలల నిరంతర యుద్ధం తర్వాత గాజా ప్రాంతంలో ఐదు లక్షల మందికి పైగా ప్రజలు ఆకలి, పేదరికం, మరణం వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని నివేదిక పేర్కొంది. జులై 1, ఆగస్ట్ 15 మధ్య సేకరించిన సమాచారం ఆధారంగా ఈ సంఖ్యను పేర్కొన్నామని తెలిపింది. సెప్టెంబర్ చివరి నాటికి అన్నార్తుల సంఖ్య సుమారు 6,41,000 మందికి పెరుగుతుందని, అంటే జనాభాలో సుమారు మూడింట ఒక వంతు అని పేర్కొంది. 'ఆకలి'ని విశ్లేషించడం ప్రారంభించినప్పటి నుండి గాజాస్ట్రిప్‌లో ఇది అత్యంత తీవ్రమైన క్షీణత అని ఐపిసి పేర్కొంది. ఇజ్రాయిల్ హమాస్‌తో యుద్ధం పేరిట మారణహోమం సృష్టిస్తోంది. ప్రజలు స్థానభ్రంశం చెందడం, మానవతా, వాణిజ్య ఆహార సరఫరాల లభ్యతపై తీవ్రమైన పరిమితులు ఈ పరిస్థితికి కారణమని పేర్కొంది. మార్చి ప్రారంభం నుండి ఇజ్రాయిల్ గాజాలోకి సాయాన్ని పూర్తిగా నిషేధించింది. మే చివరిలో తక్కువ పరిమితిలో సాయాన్ని అనుమతించింది. ఫలితంగా ఆహారం, మందులు, ఇంధనానికి తీవ్రమైన కొరత ఏర్పడింది. ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వక చర్యల వల్లే గాజా ఆకలితో అలమటిస్తోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది.

గాజా నగరాన్ని నాశనం చేస్తాం : ఇజ్రాయిల్

హమాస్ నిరాయుధీకరణకు, ఇజ్రాయిల్ షరతులకు లోబడి మిగిలిన బందీలను విడుదల చేయడానికి, యుద్ధాన్ని ముగించడానికి అంగీకరించకపోతే గాజా నగరాన్ని నాశనం చేస్తామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ సోషల్ మీడియాలో శుక్రవారం పోస్ట్ చేశారు. హమాస్ అంగీకరించకపోతే వారి రాజధాని గాజా ఇజ్రాయిల్ దాడుల్లో ధ్వంసమైన రఫా, బీట్ హనౌన్ నగరాల్లో మారుతుందని పేర్కొన్నారు.

సమ్మిళిత విద్యపై సలహా బృందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సమ్మిళిత విద్యను బలోపేతం చేసేందుకు, సలహాలు కోసం శాసనసభ, మండలి సభ్యులతో సలహా గ్రూప్‌ను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించిన జివో 269ను పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం విడుదల చేశారు.. ఎమ్మెల్యేలు సుందారపు విజయ్ కుమార్(యలమంచిలి), పివి పార్ధసారధి(ఆదోని), పి అతిధి గజపతిరాజు(విజయనగరం),కాకర్ల సురేష్(ఉదయగిరి), కంచర్ల శ్రీకాంత్(ఎమ్మెల్సీ)లతో ఈ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ చర్యలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో 125 మున్సిపాల్టీల్లో ఒక ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం పిఎం శ్రీ పథకం కింద ప్రత్యేక బడ్జెట్‌ను ఆమోదించిందని పేర్కొన్నారు. ఈ కేంద్రాలు ఆటిజం ఉన్న పిల్లల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక విద్య, చికిత్సా సేవలు అందిస్తాయని తెలిపారు.

రైతులకు సక్రమంగా ఎరువులు అందించాలి

- సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సక్రమంగా పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా, డిఎపి వంటి ఎరువులు అందక రైతులు రోడ్డెక్కే పరిస్థితి దాపరించిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రమంతా స్మార్ట్ పాలన జరుగుతుందని, గత ఏడాది కాలంగా పాలనను గాడిలో పెట్టామని చెప్పుకునే ప్రభుత్వ పెద్దలు రైతులకు ఎరువులు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం చాలా వరకూ తగ్గిపోయిందని తెలిపారు.

రాయలసీమ ప్రాంతంలో వేరుశనగ రైతులు పంట సాగు తగ్గించినట్లు, సాగర్ ఆయకట్టు కింద అసలు పంటలే మొదలు కాలేదని తెలిపారు. అప్పుడే రాష్ట్రంలో ఎరువులు దొరకడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారంటే బ్లాక్ మార్కెటింగ్ ప్రభావం ఏ మేరకు ఉందో అర్థం అవుతుందని చెప్పారు. యూరియా కట్టపై రూ.100, డిఎపి కట్టపై రూ.200 అదనంగా వసూలు చేస్తున్నా వ్యవసాయ, విజిలెన్స్ శాఖ ఏం చేస్తున్నాయో ప్రభుత్వం సమాధానం ఇవ్వాలన్నారు. ఒక రాష్ట్ర మంత్రి పర్యవేక్షణలో సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమించి, రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఎరువులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కూలి రేట్ల పెంపుపై హర్షం

- ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోస్ హమాలీ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిబిసిఎల్ డిపోలలో పని చేస్తున్న 2,300 మంది హామాలీలకు సంబంధించి దిగుమతి కూలి రేట్ల పెంపుపై ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ (సిఐటియు) హర్షం వ్యక్తం చేసింది. దిగుమతి కూలి రేటును ప్రస్తుతం ఉన్న పెట్టకు రూ.6.60 నుంచి రూ.7.20కు పెంచేందుకు కంపెనీ యాజమాన్యం, హమాలీ యూనియన్స్ నాయకుల మధ్య ఎక్సైజ్ అధికారుల సమక్షంలో శుక్రవారం ఒప్పందం జరిగిందని యూనియన్ గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.మదన్‌మోహన్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత అక్టోబరులో ఎగుమతి కూలీరేట్లు పెట్టెకు రూ.7.35 నుంచి రూ.8 సాధించుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం పెరిగిన దిగుమతి కూలి రేట్లు ఆగస్టు 1వ తేదీ నుంచి ఎరియర్స్‌తో సహా చెల్లించేందుకు యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు. ఈ నెల మార్చి 31వ తేదీన దిగుమతి కూలీ ఒప్పందం ముగియడంతో అప్పటి నుంచి ఎరియర్స్ కూడా చెల్లించాల్సి ఉంది. కూలి రేట్ల ఒప్పందం కాల పరిమిరితి 2025 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31వ తేదీ వరకూ ఉంటుందని తెలిపారు. చర్చలు ఫలప్రదం అయినందుకు మద్యం సంస్థల అసోసియేషన్ ప్రతినిధులు కామేశ్వరరావు, సత్యపాల్ రెడ్డి, చంద్రశేఖర్‌లకు రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. చర్చల్లో యూనియన్ నాయకులు అధ్యక్షులు ఎస్.వి సుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రసాదరావు, కొండలరావు, రమేష్, సాంబయ్య, మల్లిఖార్జునరావు, సూరిబాబు, కోటేశ్వరరావు, ఎర్రయ్య రెడ్డి, జగన్, ఎఐటియుసి అనుబంధ సంఘం నాయులు వెంకటసుబ్బయ్య, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బ్రిడ్జిలంక నిర్వాసితులు



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం వద్ద కొట్టుకు పోయిన కాజ్‌వే ప్రాంతం



ముంపులోనే ఉన్న విఆర్.పురం మండలంలోని ఒడ్డుగూడెం కాలనీ గృహాలు

గోదావరి తగ్గుముఖం

- ధవళేశ్వరం వద్ద 14.30 అడుగుల ప్రవాహం
- కోనసీమలో నీట మునిగిన, కొట్టుకుపోయిన కాజ్‌వేలు
- పునరావాస గ్రామాలకు లంక ప్రజలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉగ్రరూపం దాల్చిన గోదావరి శాంతించింది. క్రమంగా ప్రవాహం తగ్గుముఖం పట్టింది. గురువారం నాటికి 52 అడుగులకు చేరుకున్న గోదావరి శుక్రవారం సాయంత్రానికి 44.5 అడుగులకు చేరింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. ఇదే సమయంలో ధవళేవ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 14.30 అడుగుల వద్ద ప్రవాహం స్థిరంగా ఉంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను ఎత్తి 13,57,119 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

నీట మునిగిన కాజ్‌వేలు, రాకపోకలు బంద్

బ్యారేజీ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పలు కాజ్‌వేలు నీట మునిగాయి. దీంతో గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. సఖినేటిపల్లి మండలంలో అప్పనిరామని లంక గ్రామానికి వెళ్లే కాజ్‌వే నీట మునిగింది. అయివల్లి మండలంలో అయినవిల్లి లంక, పి.గన్నవరంలో కనకాయలంక కాజ్‌వే, మామిడికుదురులో అప్పనపల్లి కాజ్‌వేలు నీట మునిగాయి. ఆలమూరు మండలంలో బడుగువాని లంక, పి.గన్నవరంలో గంటి పెదపూడి, ఊడుమూడు లంక, అల్లవరం మడలంలో బోడసకుర్రు పల్లెపాలెం లంకల్లోకి వరద నీరు ప్రవహించింది. రాజమహేంద్రవరంలోని బ్రిడ్జి లంక, సీతానగరంలోని కనకాయిలంక ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆలమూరు మండలం మూలస్థానం వద్ద ఉన్న కాజ్‌వే కొట్టుకు పోయింది. 21 తూరలతో రూ.ఎనిమిది లక్షలతో ఈ కాజ్‌వేను ఇటీవలే నిర్మించారు. వరద ప్రవాహానికి ముక్కలుగా విరిగిపోయి తూరలు కొట్టుకుపోయాయి. దీంతో కాజ్‌వే అవతల ఉన్న తోకలంక గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

తగ్గని వశిష్ట గోదావరి

ధవళేశ్వరం నుంచి పెద్ద ఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతుండడంతో వశిష్ట గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. ఆచంట మండలంలో పుచ్చలంక, నకిడిలంక, రాయిలంకలు ముంపుబారిన పడ్డాయి. అయోధ్యలంకలో పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుకుంటోంది. అయోధ్యలంకలో ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. లంక భూముల్లోకి వరద నీరు చేరుతుండడంతో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక, బాడవ, లక్ష్మీపాలెం తదితర గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 11,87,497 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 33,500 మీటర్లు, స్పిల్ వే దిగువన 25.210 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. పోలవరం ముంపు మండలాలైన విఆర్.పురం - చింతూరు మండలాల మధ్య రహదారులు వరదనీటిలోనే ఉన్నాయి. విఆర్.పురం మండలంలోని సుమారు 60 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. శ్రీరామగిరి - సీతంపేట, తుష్టివారిగూడెం, ప్రత్తిపాక, కన్నాయిగూడెం, చింతరేవుపల్లి మధ్యలో పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన వారికి కనీస మంచినీరు కూడా అందించలేదని పలువురు వాపోయారు. చింతూరు మండలం మీదుగా సాగే ఒడిశా - ఛత్తీస్‌గఢ్ రహదారులు నేటికీ ముంపునుంచి తేరుకోలేదు. రెండు రోజుల నుంచి వాహనాలు రోడ్లపైనే బారులు తీరాయి. చింతూరు సంత మార్కెట్ ప్రాంతంలో కొన్ని నివాసాలు ముంపులోనే ఉన్నాయి.


శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి

కృష్ణ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. యథావిధిగా పది గేట్లను 18 అడుగుల మేర ఎత్తి దిగువకు 4,21,530 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తుంగ్రభద్ర డ్యామ్ నుంచి 1,08,054 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కులతో కలిపి శ్రీశైలం జలాశయానికి 4,57,237 క్యూసెక్కుల నీరు చేరుతోంది. నాగార్జున సాగర్‌కు 4.32 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా 26 గేట్లను ఎత్తి 4.05 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి 4.32 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. బ్యారేజీ 70 గేట్లను ఎత్తి 4,16,622 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తున్నారు. నదీ పరీవాహక ప్రాంతాలతోపాటు లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇంకా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పోలవరం ముంపుప్రాంత ప్రజలను అప్రమత్తం చేయండి

- చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



కృష్ణ గోదావరి వరదల కారణంగా పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు, అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సిఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణ, గోదావరి వరదలు, ముంపు ప్రాంతాలు, తీసుకుంటున్న చర్యల గురించి ఢిల్లీ నుంచి సిఎం , శుక్రవారం సిఎస్ విజయానంద్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ పోలవరం ముంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని వస్తున్న వార్తల నేపథ్యంలో అధికారం యంత్రాంగం సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరదలు, భారీ వర్షాలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు నిరంతరం సమాచారం ఇవ్వడంతో పాటు తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా చూడాలని సిఎం అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రెండు నదులకు వస్తున్న వరద ప్రవాహాలు, పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు, నివాస సముదాయాలకు సంబంధించి అధికారులు సిఎంకు వివరించారు. కృష్ణా నదికి ఎగువ నుంచి ప్రవాహాలతో శ్రీశైలం నుంచి 5.20లక్షలు, నాగార్జున సాగర్ నుంచి 4.32లక్షలు, పులిచింతల నుంచి 4.07లక్షలు, ప్రకాశం బ్యారేజ్ నుంచి 4.53లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల అవుతోందని సిఎంకు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 13,42,307 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోందని సిఎంకు తెలిపారు. గోదావరి వరదల కారణంగా పరీవాహక ప్రాంతంలోని లంకగ్రామాలు, పోలవరం ముంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినట్లు అధికారులు సిఎంకు వివరించారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు : సిఎం

రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందుల లభ్యత, సరఫరా అంశాలపై సిఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎరువుల కొరత లేకుండా అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిలెన్స్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎరువులు దారి మళ్లకుండా ధర పెరగకుండా చూడాలని సిఎం పేర్కొన్నారు. ఎరువుల కొరత అనే సమస్య ఉన్నట్లు ఎక్కడ నుంచి సమాచారం వచ్చినా రాష్ట్రస్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సిఎం స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ధరియాలతిప్ప సమీపంలో సముద్రంలో ఓఎన్‌జిసి గ్యాస్ పైప్ లీక్ ఘటనపై కూడ సిఎం అధికారులతో మాట్లాడారు. లీకైన పైప్‌ను తనిఖీలు చేసి సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు.

ప్రతి ఏటా టీచర్ పోస్టుల భర్తీ

- సమర్థవంతంగా సంస్కరణలు అమలు
- తల్లికి వందనం చివరి దశ
- నిధుల విడుదల సమీక్షలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతిఏటా డిఎస్సి ప్రకటించి ఖాళీలను భర్తీ చేస్తామని విద్య,ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. రాష్ట్రచరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డిఎస్సి ప్రకటించి విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు.

ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విద్యలో విద్యప్రమాణాలను మెరుగుపర్చేందుకు 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేశామని తెలిపారు. సంస్కరణల అంతిమ లక్ష్యం అభ్యసన ఫలితాలే అని, మెరుగైన ఫలితాలపై దృష్టిసారించాల్సిన బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. దేశంలో తొలిసారిగా ప్రతి బిడ్డకు గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ఒక హక్కుగా ఉపాధ్యాయుల సహకారంతో ఇవ్వబోతున్నామని తెలిపారు. అనవసరమైన శిక్షణా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయొద్దని సూచించారు. తల్లికి వందనం చివరి విడత పెండింగ్ దరఖాస్తులను ఆమోదిస్తూ రూ.325కోట్లు విడుదల చేశామని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా 2024-25 ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలకు దాతల సహకారంతో భూసేకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తమమైన ప్రీస్కూల్ పాలసీ కోసం ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు.నిర్ణీత క్యాలెండర్ ప్రకారం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్ అండ్ స్పోర్ట్స్ ఫేర్‌లు నిర్వహణకు శాప్ సహకారం తీసుకోవాలని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం నాడు అసెంబ్లీలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి స్పీకర్ అనుమతితో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విద్యార్థులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, విద్యామౌలిక సదుపాయాల సంస్థ ఎండి సిఎన్ దీవెన్ రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారి పింఛన్లు తొలగించం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అర్హులైన వారి పింఛన్లను తొలగించే ప్రసక్తే లేదని, ఈ విషయంలో ప్రతిపక్ష పార్టీ చేస్తున్న రాద్ధాంతాన్ని నమ్మవద్దని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. సచివాలయంలో పబ్లిసిటీ సెల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పింఛన్ల కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో ఏటా రూ.33 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. గత జూలై 1 నుంచి ప్రతి మాసం 65.18 లక్షల మందికి ప్రతి నెలా రూ.2,700 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్పౌజ్ పింఛన్లు 1.10 లక్షలు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఆరు నెలలకు ఒక పర్యాయం ఆరు దశల పరిశీలన పేరుతో దాదాపు 9.56 లక్షల మందికి పింఛన్లను రద్దు చేసినట్లు చెప్పారు. వికలాంగులకు పింఛను మొత్తాన్ని రూ.3 నుంచి 6 వేలకు పెంచామని, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి ఇచ్చే మొత్తాన్ని రూ.5 వేల నుంచి 15 వేలకు పెంచామన్నారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఇచ్చే పింఛనును రూ.5 నుంచి 10 వేలకు పెంచినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో బోగస్ పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని, ప్రత్యేకించి ఆరోగ్య, వికలాంగుల కేటగిరిలో కొంత మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లు క్షేత్ర స్థాయి నుంచి ఫిర్యాదులు అందాయని, ముఖ్యంగా బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, వైఎస్ఆర్ కడప జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో తనిఖీల్లో ఈ విషయాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. గత 15 ఏళ్లలో 6 లక్షల మంది వికలాంగులకు పింఛన్లు ఇస్తుండగా, గత 5 ఏళ్లలో 2.07 లక్షల మంది వికలాంగుల కు పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనర్హులు బోగస్ ధృవీకరణ పత్రాలతో ఈ పింఛన్లు పొందున్నట్లు స్పష్టమవడంతో ప్రభుత్వం ధృవీకరణ పత్రాలను పరిశీలన చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. గత 9 నెలలుగా పారదర్శకంగా పరిశీలన జరుగుతుందని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న వారి విషయంలో వైద్యులే ఇళ్లకు వెళ్లి పరిశీలన చేస్తున్నారన్నారు.

7.95 లక్షల మంది ధృవీకరణ పత్రాలు పరిశీలించాల్సి ఉండగా, 5.55 లక్షల మందికి సంబంధించి మాత్రమే పరిశీలన పూర్తయినట్లు వెల్లడించారు. ఈ పరిశీలనలో దాదాపు 80 వేల మంది అనర్హులను గుర్తించినట్లు తెలిపారు. అయితే, వారి అర్హతను బట్టీ మరో కేటగిరిలో అర్హులుగా గుర్తిస్తూ కన్వర్టు చేయడం జరిగిందన్నారు. దాదాపు 20 వేల మంది వృద్ధాప్య పింఛను కేటగిరిలోకి మార్చినట్లు తెలిపారు.

మద్యం కేసులో నారాయణస్వామిని విచారించిన సిట్

- ఇంట్లోకి రానివ్వకపోవడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసులో రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారించింది. అనారోగ్య కారణాల రీత్యా ప్రత్యక్ష హాజరు నుంచి కోర్టు ఆయనకు మినహాయింపు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం నాడు ఐదుగురితో కూడిన సిట్ అధికారులు నగరి నియోజకవర్గంలోని పుత్తూరులో ఉన్న నారాయణస్వామి ఇంటికి వెళ్లారు.

అయితే వారిని లోపలికి రానివ్వలేదు. దీంతో.. పక్కనే ఉన్న మరో ఇంటి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయనను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. కాగా ఇదే కేసులో అరెస్టు అయిన అప్పటి ఓఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప తదితరులు ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో నారాయణస్వామి ఇంటికి సిట్ అధికారుల బృందం రావడంతో..ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉందని భావించిన వైసిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అక్కడ రోజంతా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

ఎరువుల బ్లాక్‌మార్కెటింగ్‌ను అరికట్టేందుకు విజిలెన్స్ దాడులు

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్‌గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

యూరియాను దారి మళ్లించడం, అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం చట్ట విరుద్ధమే కాకుండా రైతులకు ఇబ్బంది కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా గోదాములు, హోల్ సేల్ డీలర్లు, రిటైల్ షాపులపై విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిల్వలు, పంపిణీ జరుగుతున్నాయా లేదా అనే దానిపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. యూరియా అక్రమ నిల్వలు లేదా దారి మళ్లింపుకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు సమీపంలోని విజిలెన్స్ కార్యాలయానికి తెలపాలని ఆయన కోరారు.

పార్లమెంట్ కమిటీలపై సమీక్షించనున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి పార్లమెంట్ కమిటీ అధ్యక్షుల ఎంపికపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మూడు రోజుల పాటు సమీక్ష నిర్వహించనున్నారు. కమిటీల ప్రతిపాదనల కోసం ప్రతి పార్లమెంట్‌కు ముగ్గురిని పరిశీలకులను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల 24వ తేదిన అనకాపల్లి, నర్సాపురం, ఏలూరు, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, ఒంగోలు కమిటీల అధ్యక్షుల ఎంపికపై చర్చించనున్నారు. 25వ తేదిన అరకు, కాకినాడ, అమలాపురం, బాపట్ల, రాజంపేట, చిత్తూరు, కడప, హిందూపూర్‌లపై సమీక్షిస్తారు. 26వ తేదిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, నెల్లూరు, తిరుపతి, నంద్యాల, కర్నూలు, అనంతపురం కమిటీలకు ఎంపికపై చర్చించనున్నారు.

పంపిణీకి సిద్ధంగా 21 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు

- మంత్రి అనగాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల కొత్త పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాస్ పుస్తకాలు ముద్రణ అయిన తర్వాత కూడా మరలా జాయింట్ కలెక్టర్ కార్యాలయం స్థాయిలో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల్లో వివరాలు లైవ్ వెబ్‌ల్యాండ్ డేటా ప్రకారం ఉన్నాయో లేవో క్షుణ్ణంగా పరిశీలన చేయిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరిందన్నారు. గత ముఖ్యమంత్రి ఫోటోలతో ముద్రించిన పాస్ పుస్తకాల స్థానంలో రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు తమ ప్రభుత్వం ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లోని రైతులకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇస్తున్నామన్నారు. మంచి ఉద్దేశ్యంతో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని, అందరూ ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి అనగాని విజ్ఞప్తి చేశారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల్లో 50 శాతం తప్పుల తడకలే ఉన్నాయంటూ మీడియాలో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. గత ప్రభుత్వ కాలంలో హడావుడిగా చేసిన రీ సర్వే కారణంగా చాలా తప్పులు దొర్లాయని, వారిచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాల్లో తప్పులు ఉన్నాయన్నారు. వాటిని సరిచేసేందుకు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రీ సర్వే జరిగిన 6688 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా 2లక్షల 79వేల అర్జీలు వచ్చాయని, వాటన్నింటినీ వంత శాతం పరిష్కరించామని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం 17,600 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి వాటిలో వచ్చిన 1.85లక్షల అర్జీలను వంద శాతం పరిష్కరించామన్నారు. వీటి తర్వాత ఇంకా తమ భూముల వివరాలకు సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పులకు సంబందించి ఎవరైనా భూ యజమానులు ప్రభుత్వానికి విన్నవించుకునేందుకు నాలుగు నెలల సమయాన్ని కూడా ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమయంలో రైతులు, భూ యజమానుల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి రికార్డులను లైవ్ వెబ్‌ల్యాండ్‌లో సరి చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. లైవ్ వెబ్‌ల్యాండ్‌లో ఉన్న డేటానే కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల్లో ముద్రించినట్లు తెలిపారు. రైతులు రుణాలు పొందేందుకు పట్టదారు పాస్‌పుస్తకంతో పని లేదని మంత్రి పేర్కొన్నారు. ప్రతి బ్యాంకర్‌కు లైవ్ వెబ్‌ల్యాండ్ లోన్ చార్ట్ మాడ్యూల్ అందుబాటులో ఉందని, దాని ప్రకారమే రుణాలిస్తారన్నారు. అందులో నిజమైన భూ యజమాని ఎవరో తెలిసిపోతుందన్నారు.

వ్యవసాయేతర అవసరాలకు యూరియా వినియోగిస్తే కేసులు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయేతర అవసరాలకు యూరియాను వినియోగించే వారిపై కేసులు నమోదు చేసిన కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను ఆయన శుక్రవారం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రానికి అవసరానికి మించి యూరియాను కేంద్రం సరఫరా చేసినా క్షేత్ర స్థాయిలో పలు చోట్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఈ అంశంపై పంపిణీ వ్యవస్థలో సమస్యలను గుర్తించి లోపాలను సరిదిద్దాలన్నారు. యూరియా సరఫరా, లభ్యత విషయంలో రైతులకు అపోహలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ముందస్తు అవసరాలకు, రాబోయే రబీ సీజన్‌కు అవసరమైన యూరియాను ఇప్పడే కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని రైతులకు సూచించారు. మార్క్‌ఫెడ్, ప్రైవేటు వ్యాపారులకు ప్రస్తుతం ఉన్న యూరియా పంపిణీ, నిష్పత్తి 50:50 నుంచి 70:30కి తగ్గించాలని ఆదేశించారు. యూరియా వినియోగంపై నిఘాను ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే జిల్లాల పరిధిలో పోలీసు, రెవెన్యూ, పరిశ్రమలు ఇతర శాఖల అధికారులతో పర్యవేక్షణలో బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం యూరియా విషయంలో యూరియా పరిశ్రమల అవసరాలకు మళ్లకుండా నిఘా పెంచాలని, వ్యవసాయేతర అవసరాలకు యూరియాను ఉపయోగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృష్ణా, ఏలూరు, గోదావరి జిల్లాల్లో ఆక్వా సాగు అధికంగా ఉండటంతో మరింత నిఘా ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి హరీష్ కుమార్ గుప్తా, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, సిఎంఒ కార్యదర్శి రాజమౌళి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాధిపతులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

కుమార్తె వరసయ్యే యువతిపై అత్యాచారయత్నం

- కామాంధుడికి యువకుల దేహశుద్ధి
- పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి- రేగిడి


నిందితుడు రామును విద్యుత్ స్తంభానికి కట్టిన యువకులు

వరుసకు కుమార్తె అయిన 19 ఏళ్ల యువతిపై ఓ కామాంధుడు అత్యాచారయత్నం చేసిన ఘటన విజయనగరం జిల్లా రేగిడి మండలం ఉణుకూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. యువతి తల్లి, గ్రామస్తులు చెప్పిన వివరాల ప్రకారం... ఉణుకూరు దళిత కాలనీలో దిబ్బ రాము (58) తన ఇంటి వెనుక వీధిలో శుక్రవారం మద్యం సేవించి తిరుగుతున్నాడు. ఇంతలో తమ కుటుంబ సభ్యులైన వరసకు తమ్ముడు కుమార్తె అయిన యువతి ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించి ఆ ఇంట్లోకి చొరబడ్డాడు. యువతి నోటిలో గుడ్డలు కుక్కి అత్యాచార యత్నం చేశాడు. ఆమె కేకలు వేయడంతో అటుగా వెళ్లిన యువకులు విని తలుపులు తీసి రామును పట్టుకున్నారు. నిందితుడిని విద్యుత్ స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకుని గ్రామస్తులంతా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. యువతి ఫిర్యాదు మేరకు రేగిడి పోలీసులు రామును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నీలావతి తెలిపారు.

కుంగిన వంతెన

ప్రజాశక్తి - వడ్డాది (అనకాపల్లి)

ఇటీవల కురిసిన వర్షాలకు అనకాపల్లి జిల్లాలోని విజయరామరాజుపేట - కట్టువాని అగ్రహారం మధ్య బొడ్డేరుపై ఉన్న వంతెన శుక్రవారం కుంగిపోయింది. దీంతో బుచ్చయ్యపేట మండలంలోని విజయరామరాజుపేట నుంచి చీడికాడ మండలంలోని కట్టువాని అగ్రహారం, దండి సురవరం, దిబ్బపాలెం, ఇంటిపాలెం, తునివలస తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెండు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే తాచేరు వంతెన కూలిపోయి ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ స్తంభించింది. తాజాగా కట్టువాని అగ్రహారం బ్రిడ్జి కుంగిపోవడంతో రాకపోకల సమస్య మరింత తీవ్రమైంది. 15 ఏళ్ల క్రితం విశాఖ డెయిరీ సహకారంతో ఈ వంతెన నిర్మించారు. రెండు మండలాలకు ప్రధాన వారధిగా ఇది నిలిచింది.

కారిడార్ నిర్వాసితులకు
రూ.25 లక్షలు ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాల్సిందే..

- అధికారులు చట్టాలను ఉల్లంఘిస్తే న్యాయపోరాటం చేస్తాం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం


నిర్వాసితులతో లోకనాథం తదితరులు

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

వైజాగ్ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం చేపట్టిన భూసేకరణలో నివాస గృహాలు కోల్పోయిన వారికి రూ.25 లక్షల ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, అధికారులు చట్టాలను ఉల్లంఘిస్తే నిర్వాసితులతో కలిసి న్యాయ పోరాటం చేస్తామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని చందనాడ పంచాయతీ తుమ్మలపేట గ్రామంలో శుక్రవారం జరిగిన నిర్వాసితుల సమావేశంలో ఆయన పాల్గొని భూ నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పరిశ్రమల కోసం భూములు, నివాసాలు త్యాగం చేసి, సర్వస్వం కోల్పోయిన భూ నిర్వాసితులను ఆదుకోవడంలో టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

భూసేకరణలో ఆనాడు అనేక హామీలు ఇచ్చిన అధికారులు ఇప్పుడు వాటిని అమలు చేయకుండా నిర్వాసితులను కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటున్నారని, ఇది ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ఆర్ఆర్ ప్యాకేజీ కోసం నిర్వాసితులు అనేక రూపాల్లో ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని, కనీసం వారితో చర్చలు జరపకుండా, మభ్యపెట్టి బ్యాంకు ఖాతాల పత్రాలు తీసుకోవడం చట్టఉల్లంఘనే అవుతుందని పేర్కొన్నారు. భూ నిర్వాసితుల సమస్యలపై వెంటనే రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, నర్సీపట్నం ఆర్‌డిఓ రమణ జోక్యం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్ల ధర్నా

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల నష్టపోతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఏలూరులో ఆటోడ్రైవర్లు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ నుండి జిల్లా కలెక్టరేట్ వరకూ ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.గోపీ, చక్రాల అమర్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం అమలు చేసేటప్పుడు ముందుగా నష్టపోయేది ఆటో డ్రైవర్లే అనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెం.21ని రద్దు చేస్తామని టిడిపి కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని విమర్శించారు. బ్రిటిష్ చట్టాల కంటే కఠినంగా తయారు చేసిన బిఎంఎస్ 106 (1)(2) చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ నాయకులు అందజేశారు.

స్టీల్ సిటీ ఆర్‌టిసి డిపోను తొలగించొద్దు

- కొనసాగించాలని రౌండ్‌టేబుల్ తీర్మానం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అప్పడు, పాల్గొన్న ఆర్‌టిసి యూనియన్స్, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఉన్న స్టీల్ సిటీ ఆర్‌టిసి డిపోను అక్కడే కొనసాగించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఆర్‌టిసి అసోసియేషన్స్, అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సమావేశానికి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంసిహెచ్.అప్పడు అధ్యక్షత వహించారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.చంద్రయ్య, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కెఎస్ఎస్.మూర్తి, జై భీమ్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.రాంబాబు, వైఎస్ఆర్‌టియు నాయకులు బి.నాగేశ్వరరావు, ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ప్రధాన కార్యదర్శి వి. తులసీరామ్, హయ్యర్ బస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అర్జున్, ఎఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.జగన్, వివిధ ప్రజా, కార్మిక సంఘాల నాయకులు త్రినాథ్, గణేష్, వి.రాములు, మేరీ, ఎన్.ప్రకాశరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, వైటి.దాసు, ఎ.సీతాలక్ష్మి, ప్రసాద్, ఎస్ఆర్.రావు, ముత్యాలమ్మ, చలపతి హాజరై మాట్లాడారు. స్టీల్ సిటీ డిపోను కూర్మన్నపాలెంలో 1992 జనవరి 24న ప్రారంభించారని, డిపో ఆవిష్కరణకు ముందు స్టీల్ యాజమాన్యం, ఆర్‌టిసి యాజమాన్యానికి మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. 33 సంవత్సరాల లీజుకుగాను సంవత్సరానికి రూ.ఎనిమిది లక్షల చొప్పున 33 ఏళ్లకు రూ.రెండు కోట్ల 50 లక్షలను డిపాజిట్ రూపంలో స్టీల్ యాజమాన్యానికి ఆర్‌టిసి జమ చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు లీజును పునరుద్ధరించకుండా లీజు అయిపోయిందనే నెపంతో ఆర్‌టిసి డిపోను తొలగిస్తామనడం సరైనది కాదన్నారు. మరోపక్క లీజు కొనసాగించేందుకు రూ.133 కోట్లు డిమాండ్ చేయడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రాంతంలో ఆ డిపో ఉండటం వల్ల పరిసర ప్రాంతాల గ్రామాలకు రవాణా సదుపాయం సులువుగా ఉందని వివరించారు. విశాఖలో రోజూ ఆ డిపో నుంచి సుమారు 92 వేల మంది ప్రజలు ప్రయాణిస్తున్నట్లు అధికారిక లెక్కలు ఉన్నాయని తెలిపారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల మధ్య ఉన్న ఈ డిపో వల్ల కార్మికులకు, విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో మాట్లాడి డిపోను అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

యానాంలో పగిలిన గ్యాస్ పైపులైను

- ఉవ్వెత్తున ఎగసిన మంటలు
- సరఫరాను నిలిపేసిన ఒఎన్‌జిసి

ప్రజాశక్తి - యానాం


ఘటన జరిగిన సమయంలో ఎగసిపడుతున్న మంటలు

యానాంలోని సముద్రం నుంచి ఐలాండ్ నెంబర్ 3 మీదుగా వెళ్లిన ఒఎన్‌జిసి గ్యాస్ పైప్‌లైన్ లీక్ కావడంతో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. గోదావరి నది పాయ మధ్యలో శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో, సమీప గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సముద్రంలోని ఒఎన్‌జిసి క్షేత్రం నుంచి గోదావరి నదీ పాయలో నుంచి రెండు భారీ గ్యాస్ పైపులైన్లను ఒఎన్‌జిసి గతంలో వేసింది. సుమారు 30 నుంచి 40 అడుగుల ఎత్తులో మంటలు వచ్చాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న ఒఎన్‌జిసి అధికారులు పైపులైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను నిలిపేశారు. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. గ్యాస్ మాత్రం ఇంకా లీకవుతూనే ఉంది. దీనివల్ల ఎలాంటి ప్రమాదమూ ఉండదని ఒఎన్‌జిసి అధికారులు తెలిపారు. ఈ మంటలు గోదావరి నదీతీరం వెంబడి ఉన్న మొక్కలకు వ్యాపించడంతో సుమారు 100కు పైగా మొక్కలు కాలిపోయాయి. ఈ ఘటన ఎలా జరిగిందనేది తెలియాల్సి ఉంది. టెక్నీషియన్లు వచ్చి పరీక్షించిన తరువాత విషయాలు వెల్లడిస్తామని ఒఎన్‌జిసి అధికారులు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేపట్టినట్టు యానాం పోలీసులు తెలిపారు. ఘటనా ప్రాంతాన్ని యానాం పరిపాలనాధికారి మునిస్వామి, యానాం ఎస్‌పి చింతా కోదండరామ్, ఎస్ఐలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు, శేరు నూకరాజు పరిశీలించారు. ఈ ఘటనపై పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి ఆరా తీశారు.

పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలి

ఎస్‌వి యూనివర్సిటీ ఎదుట విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - ఎస్‌వి క్యాంపస్ (తిరుపతి)


ఎస్‌వి యూనివర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ తిరుపతిలోని ఎస్‌వి విశ్వవిద్యాలయం విద్యార్థులు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ను శుక్రవారం ముట్టడించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరసన్న, వినోద్ అధ్యక్షతన జరిగిన ఆందోళన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భగత్ రవి, రీసెర్చ్ స్కాలర్ అశోక్ మాట్లాడారు. విద్యార్థుల జీవితాలతో పరీక్షల విభాగం చెలగాటం ఆడడం సరికాదన్నారు. పరీక్షలు అయిన 45 రోజులలోపు ఫలితాలు ఇవ్వాల్సి ఉన్నా పది నెలలుగా పరీక్షా ఫలితాలు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో, హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించలేని వారు వెంటనే రాజీనామా చేయాలన్నారు. అమ్మాయిల హాస్టల్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉన్నా పట్టించుకోవడంలేదని, యూనివర్సిటీలో పోటీ పరీక్షలు కోసం ప్రత్యేకంగా సెంటర్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, క్యాంపస్‌లో యుజిసి నెట్, జెఆర్ఎఫ్, గ్రూప్స్, సివిల్స్ కోసం కోచింగ్ సెంటర్లు పెట్టాలని డిమాండ్ చేశారు. అన్ని డిపార్ట్మెంట్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు స్పందించి వారంలోపు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. వారంలోపు సమస్యల పరిష్కారం చూపకపోతే అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని రోడ్ల పైకి వచ్చి ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు షేక్ష, తిరుమలేష్, వాసు, శ్రీకాంత్, భాను, రాజు, శ్రీనివాస్ నాయక్, చక్రవర్తి, అనిల్, వేణు, మహేశ్వరీ పాల్గొన్నారు.

భారత వృద్ధికి గ్లోబల్ సవాళ్లు

- ఈ ఏడాది జిడిపి 6.3 శాతమే
- ఎస్‌బిఐ రీసెర్చ్ రిపోర్ట్
- ఆర్‌బిఐ అంచనాల కంటే తక్కువ




న్యూఢిల్లీ : అంతర్జాతీయ సవాళ్లు భారత వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని ఎస్‌బిఐ రీసెర్చ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత జిడిపి 6.3 శాతానికే పరిమితం కానొందని పేర్కొంది. ఇది ఆర్‌బిఐ అంచనా 6.5 శాతం కంటే తక్కువని తెలిపింది. గడిచిన 2024-25లో 6.5 శాతానికి వృద్ధి పడిపోయిన విషయాన్ని గుర్తు చేసింది. ఇంతక్రితం ఏడాది ఏకంగా 9.2 శాతం పెరుగుదల నమోదయ్యింది. ఎస్‌బిఐ రీసెర్చ్ రిపోర్ట్ వివరాలు.. ప్రస్తుత 2025-26 జూన్ త్రైమాసికంలో జిడిపి 6.8-7 శాతం మధ్య ఉంటుందని అంచనా. ప్రయివేటు మూలధన వ్యయాలు తక్కువగా ఉండటంతో వృద్ధిపై ప్రతికూలత చోటు చేసుకుంది. 2025-26లో భారత జిడిపి 6.3 నుంచి 6.8 శాతం మధ్య ఉండొచ్చని రిపోర్ట్ అంచనా. ఇది బలమైన సూక్ష్మ ఆర్థికాంశాలపై ఆధారపడి ఉంటుంది. అయితే గ్లోబల్ సవాళ్లను ఎదుర్కోవడానికి జాగ్రత్తగా, వ్యూహాత్మకంగా విధాన చర్యలు అవసరం.

తక్కువ ప్రయివేటు మూలధనం వ్యయం ఉండటం ఆందోళనకర అంశం. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల వ్యయం భారీగా తగ్గింది. ఇది వృద్ధిని ప్రభావితం చేస్తోంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు పలు రంగాలను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. జులై నుంచి సెప్టెంబర్‌తో ముగియనున్న ద్వితీయ త్రైమాసికంలో టెక్స్‌టైల్స్, అభరణాలు, తోలు, రసాయనాలు, వ్యవసాయచ ఆటో మొబైల్ పరికరాలు తదితర రంగాల ఆదాయాల్లో ఒత్తిడి జిడిపిపై ప్రతికూలతను పెంచనుందనని ఎస్‌బిఐ రీసెర్చ్ తన రిపోర్ట్‌లో పేర్కొంది.

ట్రంప్ అధిక టారిఫ్‌లు భారత జిడిపిని దెబ్బతీయనున్నాయని ఇప్పటికే పలు ఎజెన్సీలు విశ్లేషించాయి. అధిక సుంకాలతో 2025-26 భారత జిడిపి 0.4 శాతం తగ్గి 6.1 శాతానికి పరిమితం కావొచ్చని అంతర్జాతీయ ఫైనాన్సియల్ సంస్థ గోల్డ్‌మాన్ సాచ్ విశ్లేషించింది. జిడిపి 0.4 శాతం తగ్గొచ్చని ఫైనాన్సియల్ సంస్థ సిటీ, 0.3 శాతం పడిపోవచ్చని క్వాంట్ ఎకో రీసెర్చ్, 0.3-0.6 శాతం వరకు పతనం కావొచ్చని కొటాక్ అల్టర్నేట్ విశ్లేషించాయి. ఫిచ్ రేటింగ్స్ 6.3 శాతానికి కోత పెట్టిన విషయం తెలిసిందే.

రూపాయి వెలవెల

- మరో 27 పైసలు పతనం



న్యూఢిల్లీ : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజు రోజుకు వెలవెల పోతోంది. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ.. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఎఫ్ఐఐలు తరలివచ్చినప్పటికీ రూపాయి పతనం కావడం ఆందోళకరం. అమెరికాతో వాణిజ్య ఒప్పందం అనిశ్చితికి తోడు యుఎస్ ఫెడ్ వడ్డీ రేట్లపై అంచనాలు, ఆగస్టు 27 నుంచి భారత్‌పై 50 శాతం టారిఫ్‌లు, డాలర్లకు డిమాండ్ తదితర అంశాలు రూపాయిపై ఒత్తిడిని పెంచాయని ఫారెక్స్ నిపుణులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 27 పైసలు పతనమై 87.52కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 87.37 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 87.32-87.55 మధ్య కదలాడింది. ఇంతక్రితం సెషన్‌లో 18 పైసలు విలువ కోల్పోయింది. వారాంతంలో ముడి చమురు బ్యారెల్ ధర 0.31 శాతం తగ్గి 67.46 డాలర్ల వద్ద ముగిసింది.


బెంగళూరులోని ఏస్టర్ సిఎంఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పురుషోత్తం రెడ్డి

టిడిపి, వైసిపి మద్దతుదారుల ఘర్షణ

- చిలమత్తూరు ఎంపిపికి గాయాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో పాతకక్షలు భగ్గుమన్నాయి. గత ఎన్నికల సమయంలో పోలింగ్ రోజు మండల పరిధిలోని హుస్సేన్‌పురం గ్రామంలో వైసిపి ఎంపిపి పురుషోత్తంరెడ్డి, టిడిపి నాయకులు బాబురెడ్డి మద్దతుదారుల మధ్య ఘర్షణ జరిగింది. అప్పట్లో పోలీసు కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి ఈ రెండు గ్రూపుల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న పాత కక్షలు శుక్రవారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గ్రామంలోని ఓ దేవాలయం వద్దకు పురుషోత్తంరెడ్డి వెళ్లి వస్తుండగా టిడిపి నాయకులు కర్రలు, రాళ్లతో దాడి చేశారంటూ ఎంపిపి తెలిపారు. దాడి అనంతరం ఆయన హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు వెళ్లారు. వైసిపి నాయకులే తమపై దాడి చేశారంటూ టిడిపి నాయకులు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎంపిపిపై దాడిని నిరసిస్తూ హిందూపురంలో వైసిపి నాయకులు ఆందోళన చేపట్టారు. దాడి ఘటనపై ఇరు గ్రూపులు పోలీసులకు ఫిర్యాదులు చేశాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

పది కిలోలు గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-కదిరి టౌన్ (శ్రీ సత్యసాయి జిల్లా)


వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి శివనారాయణశర్మ

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పోలీసులు గంజాయి ముఠాను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి పది కిలలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం స్థానిక కదిరి రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్లో సిఐ నిరంజన్ రెడ్డితో కలిసి డిఎస్‌పి శివనారాయణస్వామి విలేకరులకు వెల్లడించారు. కదిరి ప్రాంతంలో భారీగా గంజాయి విక్రయం జరుగుతోందన్న సమాచారంతో ఎస్‌పి వి రత్న ఉత్తర్వుల మేరకు కదిరి మండల పరిధిలోని కొండమనాయునిపాల్యం గ్రామ సచివాలయం వెనుకనున్న గుట్ట వద్ద గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించి గంజాయిని విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో కదిరి పట్టణానికి చెందిన జి అజాజ్, నల్లమాడ మహమ్మద్ షోయబ్, షేక్ ఆర్బాన్, షేక్ మహమ్మద్ హుస్సేన్, షేక్ అస్లామ్, ఎస్ గౌస్ బాషాలు ఉన్నారు. వారి నుంచి పది కిలోల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని మహారాష్ట్రలోని జల్గామ్ జిల్లా ఫైజాపూర్‌లో వాటర్ టాంక్ ప్రాంతంలో నివసిస్తున్న రాజు అనే వ్యక్తి నుంచి నిందితుడు అజాజ్ కొనుగోలు చేసి, రైలులో కదిరి ప్రాంతానికి తీసుకుని వచ్చేవాడు.

ఇక్కడ తన స్నేహితులైన సోయబ్, అర్బాన్, మహమ్మద్ హుస్సేన్, అస్లాం, గౌస్‌బాషాలతో కలిసి కదిరి పట్టణంలో చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి ఒక్కో ప్యాకెట్ రూ.200 నుంచి రూ.500 విక్రయించేవారు. గంజాయి విక్రయాలు, వినియోగం ఎక్కడైనా జరుగుతుంటే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిఎస్‌పి సూచించారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

సంపాదకీయం

ఏకపక్ష నిర్ణయం

వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు చేసే నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్మెంట్ యాక్ట్ (2006) రద్దుకు రాష్ట్ర మంత్రి మండలి ఏకపక్షంగా నిర్ణయించడం అభ్యంతరకరం. బుధవారం ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఓకే చేసింది కనుక ఈ ఊపులో తక్షణం నాలా చట్టం రద్దునకు ఆర్డినెన్స్ రావొచ్చు. లేదంటే త్వరలో అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో నేరుగా బిల్లు ప్రవేశపెట్టనూవచ్చు. నాలా చట్టం రద్దుపై అధికారుల స్థాయిలో భేటీలు తప్ప విస్తృతంగా చర్చించి అభిప్రాయాలు సేకరించలేదు. దీన్నిబట్టే నాలా చట్టం రద్దు ప్రక్రియను రహస్యంగా ఉంచాలన్నది టిడిపి కూటమి ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. భూములతో, సేద్యంతో ప్రత్యక్ష సంబంధం ఉన్న రైతులు, వ్యవసాయ కార్మికులకు మాట మాత్రం చెప్పకపోవడం పారదర్శకతకు పాతరేయడమే. ఇంత హడావుడి, గోప్యత ఎందుకో సులభంగానే గ్రహించవచ్చు. నాలా చట్టం రద్దు కార్పొరేట్లకు భూపందేరం కోసమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

సాగు భూములను రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, ఇతర వ్యవసాయేతర వ్యాపకాలకు విచ్చలవిడిగా మళ్లించకుండా నియంత్రించేందుకు ఉద్దేశించింది నాలా యాక్ట్. వ్యవసాయ భూములను సాగేతరాలకు మార్చుకోవాలంటే భూమి యజమానులు నాలా చట్టాన్ననుసరించి దరఖాస్తులు చేసుకోవాలి. అధికారులు పరిశీలించి కొంత పన్నులు వసూలు చేసి అనుమతులు మంజూరు చేస్తారు. కార్పొరేట్లకు భూములిచ్చేందుకు ప్రభుత్వానికి నాలా చట్టం అడ్డంకిగా తయారైందని సర్కార్ భావించినట్లుంది. నాలా పన్ను రూపంలో ఏడాదికి ప్రభుత్వానికి సుమారు రూ.300-350 కోట్ల ఆదాయం లభిస్తోంది. ఈ నిధులను స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి. నాలా రూపంలో లభిస్తున్న ఆదాయాన్ని పోగొట్టుకోకుండా, స్థానిక సంస్థలకు అన్యాయం జరగకుండా చూస్తామని, అందుకు అవసరమైన చట్టాలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇంత రిస్క్ ఉన్నా నాలా చట్టం రద్దుకే ప్రభుత్వం సై అనడానికి 'స్వర్ణాంధ్ర విజన్ 2047' లక్ష్యమే హేతువు. ఇప్పటికే ఎకరా 99 పైసలకు 99 సంవత్సరాల లీజు ప్రాతిపదికన కారుచౌకగా వేలాది ఎకరాలను కార్పొరేట్లకు ప్రభుత్వం ధారాదత్తం చేస్తోంది. అదానీ, ఇతరులకు వందల వేల ఎకరాలను ఉదారంగా రాసిచ్చేస్తోంది. అది చాలదన్నట్లు వాళ్లు ఎక్కడ కోరుకుంటే అక్కడ భూములిస్తామని బంపర్ ఆఫర్లు ఇస్తోంది. ఈ పూర్వరంగంలోనే నాలా చట్టం రద్దును చూడాలి.

విభజన అనంతర ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రాష్ట్రంగా ఉంది. అత్యధిక ప్రజలకు సేద్యపు రంగమే జీవనాధారం. ఇక్కడే సాగు భూమి తగ్గుతోందని సామాజిక, ఆర్థిక సర్వే సహా పలు సర్కారీ నివేదికలు ఘోషిస్తున్నాయి. పంటలు సాగవుతున్న నికర భూమి 2008-09లో 168 లక్షల ఎకరాలు కాగా 2023-24లో 123 లక్షల ఎకరాలు. దశాబ్దంన్నరలో 45 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. ఇదే సమయంలో ఆహార ధాన్యాల సాగు పది లక్షల ఎకరాల్లో తగ్గింది. ఆరున్నర లక్షల ఎకరాల వ్యవసాయ భూమి వ్యవసాయేతర అవసరాలకు మారిపోయింది. ఈ ధోరణి భూమి వినియోగానికి ప్రమాద ఘంటిక. వ్యవసాయ భూముల పరిరక్షణ ఆవశ్యకతను నొక్కి చెబుతోంది. నాలా చట్టం ఉన్నప్పుడే తక్కువ సమయంలోనే పెద్ద ఎత్తున వ్యవసాయ భూములు వ్యవసాయేతరాలకు మారిపోయాయి. ఎలాంటి అనుమతులూ లేకుండా పట్టణాలు, నగరాలు, సెమి అర్బన్ శివార్లలోని వ్యవసాయ భూముల్లో వెంచర్లు పడుతున్నాయి. ప్రణాళికాబద్ధంగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షాలకు మునిగిపోతుండటం చూస్తున్నాం. కొద్దిమేరకైనా వ్యవసాయ భూములను నాలా చట్టం కాపాడగా, అది రద్దయితే పరిస్థితి ఇంకెంత భయంకరంగా తయారవుతుందో ఊహించవచ్చు. నాలా చట్టం రద్దుకు ముందే రైతులు, వ్యవసాయ కార్మికులతో ప్రభుత్వం చర్చించాలి. వ్యవసాయ భూముల పరిరక్షణకు సమగ్ర చట్టం చేయాలి. భూమి వినియోగంపై పాలసీ తీసుకు రావాలి. ఆ పని చేయకుండా నాలా చట్టాన్ని రద్దు చేస్తే రైతులకు, కూలీలకు, సేద్యానికి, ప్రజల ఆహారానికి భవిష్యత్‌లో జరిగే నష్టాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది.


సందర్భం



ప్రజల్ని ప్రేమించలేనివాడు ఎన్నటికీ దేశభక్తుడు కాడు, కాలేడు.
- టంగుటూరి ప్రకాశం, ఆంధ్ర కేసరి.
జననం : 23.8.1872
మరణం : 20.5.1957

ఎన్నికల కమిషన్ విశ్వాస సంక్షోభం

ప్రధాన మీడియాలో వచ్చిన సర్వేలు, డేటా అంశాలను చూసినా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ లోలోపలి లక్ష్యం ఏంటో బట్టబయలవుతుంది. బీహార్ జనాభాలో ఈ 11 నిర్దేశిత పత్రాల లభ్యత అత్యంత తక్కువగా ఉంటుందని లోక్‌నీతి-సి.ఎస్.డి.ఎస్ అధ్యయనం నిరూపించింది. రాష్ట్రంలో అలాంటి సర్టిఫికెట్లు ఇచ్చే మౌలిక వ్యవస్థ అరకొరగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. మరో అధ్యయనం ప్రకారం ముస్లింలు, మహిళలు ఈ తొలగింపులకు గురైన వారిలో అధిక నిష్పత్తిలో ఉన్నారని తేలింది. లోతుగా పాతుకుపోయిన సామాజిక అసమానతలు, సాధికారతలో తీవ్రమైన హెచ్చుతగ్గులను ప్రతిబింబించే పరిస్థితి ఇది.



PEOPLE'S DEMOCRACY

ఎస్.ఐ.ఆర్ పేరుతో ఎన్నికల కమిషన్ ఎన్.ఆర్.సి (పౌరసత్వ నమోదు చిట్టా)ని తీసుకువచ్చే ప్రయత్నం చేసినట్టు విస్తృతమైన అభిప్రాయం నెలకొన్నది. భారతీయ పౌరసత్వాన్ని మతపరమైన గుర్తింపుతో ముందుకు తేవాలన్న హిందుత్వ ప్రేరిత నూతన నిర్వచనంతో ఇది ముడిపడి ఉందని స్పష్టంగానే తెలుస్తుంది. రాబోయే ఎన్నికల్లో ఇది కేంద్ర ప్రచార నినాదంగా ఉండబోతుందన్నది...స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎర్రకోట నుంచి చేసిన తన స్వతంత్ర దినోత్సవ ప్రసంగంలో నొక్కి చెప్పారు. చౌరబాటుదారులనబడే వారికి వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన తాజా మత దాడి సారాంశం అదే.

ఇలా జరుగుతుందని చాలా కాలంగా అనుకుంటున్నదే. గత పక్షం రోజులలో వరుసగా సాగిన కల్లోల భరితమైన ఘటనలు ప్రజాస్వామ్యంపై పథకం ప్రకారం జరుగుతున్న తీవ్ర దాడిని ముందుకు తెచ్చాయి. ఈ దాడి అనేక స్థాయిల్లో జరుగుతున్నది. అట్టడుగున చూస్తే (ప్రజాస్వామ్యం పునాదుల పైన, ప్రాతినిధ్య ప్రభుత్వ వ్యవస్థ పైన) రాజ్యాంగ హక్కుగా వచ్చిన పౌరుల ఓటు హక్కుకే తీవ్ర ప్రమాదం. బీహార్‌లో ప్రత్యేక సమగ్ర పరిశీలన ఎస్.ఐ.ఆర్ (సర్) రూపంలో ఎదురైంది. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన భారత ఎన్నికల కమిషన్ (ఇ.సి.ఐ)నీ దెబ్బ తీయడం దీనికి మరో కోణం. ఆ ప్రకారం అది స్వతంత్రంగా పనిచేయడం, అందరి పట్ల ఒకేలా వ్యవహరించటం జరగాలి. ఇక మూడో దాడి అసలు జవాబుదారీతనం అన్నదాన్నే మోసపూరితంగా దెబ్బతీయడం జరుగుతున్నది.

ఎస్.ఐ.ఆర్ గురించి జూన్ 24వ తేదీన ఇ.సి.ఐ చేసిన బహిరంగ ప్రకటనతోనే సార్వత్రిక వయోజన ఓటింగ్ హక్కు సూత్రంపై దాడి మొదలైంది. ఎస్.ఐ.ఆర్ కు సంబంధించిన వివిధ అంశాలను ఇప్పటికే పాఠకులతో పంచుకుంటూనే వున్నాము. కొంచెం సంతోషకరమైన విషయం ఏమంటే ప్రజాస్వామ్య, లౌకిక, ప్రతిపక్ష పార్టీలు బీహార్‌లోనూ, జాతీయంగాను కూడా ఒక్కతాటిపై నిలబడి దీని గురించి ప్రతిస్పందించడం. ఉమ్మడి ప్రతిపక్ష కార్యాచరణలో చాలాకాలం పాటు స్తబ్ధత నెలకొన్న తర్వాత ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ఆ ఐక్యతకు కొత్త ఊపు తీసుకొచ్చింది. ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయడానికి నిర్ణయించిన కాలవ్యవధి చాలా అల్పంగా ఉండింది. ఎలాంటి అర్థవంతమైన, సమగ్రమైన పరిశీలనకు అది ఏ విధంగానూ సరిపోయేది కాదు. అందువల్ల దాని నిజమైన ఉద్దేశాన్ని గ్రహించటం, తగువిధంగా స్పందించటం సులభమైపోయింది. జూన్ 25నే బీహార్‌లో నిరసనలు ప్రారంభమై దేశమంతటికి విస్తరించాయంటే అదే కారణం.

ఆది నుంచి అదే తీరు

ఇ.సి.ఐ స్వతంత్ర పని విధానం కొడిగట్టిపోవడం అన్నది మొదటి నుంచి కనిపిస్తూనే ఉంది. ఈ విస్తార ప్రక్రియను ప్రారంభించడానికి ముందు ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలను విడివిడిగాగాని, ఒక్కటిగాగాని కలుసుకునే ప్రయత్నమేది చేయలేదు. ఇది దీర్ఘకాలంగా అమలవుతున్న సంప్రదాయానికి పచ్చి ఉల్లంఘనే. ఈ మినహాయింపు ఏదో యథాలాపమైంది కాదని, పక్షపాతంతో కూడిందని భావించటం అనివార్యమైంది. ప్రతిపక్ష పార్టీలు తమ నిరసనలు ప్రత్యక్షంగా ఇ.సి.ఐ కి తెలియజేస్తుంటే కమిషన్ నిర్ణయాన్ని బలపరచడం కోసం బిజెపి ఉబలాటపడింది.

పౌరుల దరఖాస్తు పత్రాలతో ఇ.సి.ఐ కోరిన 11 పత్రాలలో ఏదైనా ఇవ్వడమనేది పేద పౌరులకు, ప్రత్యేకించి వలస కార్మికులకు చాలా క్లిష్టమైన విషయమని అర్థమైపోయింది. ఎందుకంటే వలస కార్మికులు తరచూ జీవనోపాధి కోసం తిరుగుతూ ఉంటారు. రేషన్ కార్డు, ఓటర్ కార్డు ఆధార్‌ను సాధారణంగా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే పత్రాలుగా పరిగణిస్తారు. అయితే వాటిని ఆమోదించడానికి ఇ.సి.ఐ నిరాకరించడంతో ఎస్.ఐ.ఆర్ కసరత్తు నిజంగా అర్థవంతమైన పరిశీలన కోసం కాదనీ, సామూహిక ఓట్ల తొలగింపునకు మాత్రమే ఉద్దేశించబడిందని స్పష్టంగా తెలిసిపోయింది.

ఎన్నికల కమిషన్ ఏర్పడినప్పటి నుంచి ఓటరు నమోదు కోసం అనుసరిస్తున్న పద్ధతుల నుంచి మౌలికంగా వైదొలగే విధంగా ఎస్.ఐ.ఆర్ కొలబద్దలు ఉన్నాయి. ఓటు హక్కు ఎల్లప్పుడూ వయోజనులకు సార్వత్రికమైందిగా ఉండింది. యంత్రాంగమే దానికి వాస్తవ రూపం కల్పిస్తుండేది. అంతేకానీ పౌరులపై తమ పౌరసత్వం నిరూపించుకోవలసిన భారం మోపేదికాదు. దీనిపై ప్రశ్నించినప్పుడు ఎన్నికల సంఘం 326వ అధికరణను ప్రస్తావించింది. ఈ అధికరణం ప్రధాన లక్ష్యం ఓటు వేయడానికిగల సార్వత్రిక హక్కును రక్షించడమే తప్ప పౌరసత్వం ప్రస్తావన ఈ నిబంధనకు కీలకమేమి కాదు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా రాజ్యాంగంలోని ఈ నిబంధన పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారం ఇ.సి.ఐ కే ఉంటుందని చెప్పడం లేదు. సంవత్సరాల తరబడి అమలవుతూ వచ్చిన పద్ధతి అందుకు పూర్తి భిన్నమైంది. నిర్దిష్టమైన అభ్యంతరాలతో, హోంశాఖ నుంచి తనిఖీలతో మాత్రమే ఓట్ల తొలగింపు జరుగుతూ వచ్చింది. ఈ తనిఖీపై హోంశాఖ పూర్తి సాధికారత కలిగి ఉండేది.

అనివార్యంగా కోర్టుకు

జులై మొదటి వారంలో ప్రతిపక్షాలు ఇ.సి.ఐ ని కలుసుకొని తమ ఆందోళన తెలియజేశాయి. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు పరిస్థితిని చక్కదిద్దడానికి చేసిన ప్రయత్నాలను పట్టించుకోవడానికి ఎన్నికల కమిషన్ నిరాకరించింది. దాంతో ఆ పార్టీలకు చివరి ప్రయత్నంగా ...ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ రాజ్యాంగ బద్ధతను సవాల్ చేయటానికి సుప్రీంకోర్టును ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. అలాగే ముసాయిదా ప్రతి (డి.ఇ.ఆర్) ప్రచురణ తర్వాత ఈ అంశం మరింత తక్షణాంశంగా ముందుకు వచ్చింది. దాన్ని ప్రారంభించడానికి ముందున్న వాటిలో 65 లక్షల ఓట్లు తొలగించబడినట్టు డి.ఇ.ఆర్ చెప్పింది. ఇందులో అధికమైన తొలగింపులు ఓటర్ల మరణం వల్ల లేక ఆచూకీ తెలియక పోవడం వల్ల జరిగినట్టు పేర్కొనబడింది. మామూలు భాషలో చెప్పాలంటే ఇవన్నీ వలస కార్మికులకు ప్రస్తావనలే.

ఇప్పుడు మన ముందున్న అతి పెద్ద ప్రశ్న తక్షణ పరిశీలన తర్వాత భారీ సంఖ్యలో తొలగింపులకు సంబంధించిన ఆందోళన. 2025 జనవరిలో జరిగిన ఈ ప్రక్రియ తర్వాత ఏప్రిల్, మే లో జాబితా ప్రకటించబడింది. అది నిజానికి పరిశీలన కానే కాదు. కొత్త తరహాలో సృష్టించబడిన సరికొత్త జాబితా మాత్రమే. సామూహిక తొలగింపు అనే లక్ష్యంతోనే జరిగింది. ఓటర్ల జాబితాలో ఒక్క ఓటు కూడా కొత్తగా చేర్చబడలేదు. దీంతో ఇ.సి.ఐ అసలు ఉద్దేశం నగ్నంగా బయటపడింది. ఈ క్రమంలో కమిషన్ కేవలం 65 లక్షల మంది ఓట్లను తొలగించడమే కాదు, అలా తొలగించబడిన వారి పేర్లను అందుకు గల నిర్దిష్ట కారణాలను ప్రచురించడానికి కూడా నిరాకరించింది. ఈ కసరత్తు వక్రబుద్ధి ఏమిటో అర్థమైన తర్వాత సుప్రీంకోర్టు తాత్కాలిక ఉత్తర్వుతో కమిషన్‌ను తొలగించిన వారి పేర్లను అందుకు కారణాలను యాంత్రిక రూపంలో చదువుకునే విధంగా విడుదల చేయాలని ఆదేశించింది. ఆధార్‌ను నివాసానికి సాధికార సాక్ష్యంగా ఆమోదించాలని కూడా ఆదేశించింది. అయినా ఒక తీవ్రమైన సమస్య మిగిలింది. అసలు ఇ.సి.ఐ కి పౌరసత్వ నిర్ధారణ ప్రక్రియను ప్రారంభించేందుకు రాజ్యాంగబద్ధంగా అధికారం ఉన్నదా అన్నదే ఆ ప్రశ్న.

దొడ్డిదోవన ఎన్.ఆర్.సి

ఎస్.ఐ.ఆర్ పేరుతో ఎన్నికల కమిషన్ ఎన్.ఆర్.సి (పౌరసత్వ నమోదు చిట్టా)ని తీసుకువచ్చే ప్రయత్నం చేసినట్టు విస్తృతమైన అభిప్రాయం నెలకొన్నది. భారతీయ పౌరసత్వాన్ని మతపరమైన గుర్తింపుతో ముందుకు తేవాలన్న హిందుత్వ ప్రేరిత నూతన నిర్వచనంతో ఇది ముడిపడి ఉందని స్పష్టంగానే తెలుస్తుంది. రాబోయే ఎన్నికల్లో ఇది కేంద్ర ప్రచార నినాదంగా ఉండబోతుందన్నది...స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎర్రకోట నుంచి చేసిన తన స్వతంత్ర దినోత్సవ ప్రసంగంలో నొక్కి చెప్పారు. చొరబాటుదారులనబడే వారికి వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన తాజా మత దాడి సారాంశం అదే.

ప్రధాన మీడియాలో వచ్చిన సర్వేలు, డేటా అంశాలను చూసినా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ లోలోపలి లక్ష్యం ఏంటో బట్టబయలవుతుంది. బీహార్ జనాభాలో ఈ 11 నిర్దేశిత పత్రాల లభ్యత అత్యంత తక్కువగా ఉంటుందని లోక్‌నీతి-సి.ఎస్.డి.ఎస్ అధ్యయనం నిరూపించింది. రాష్ట్రంలో అలాంటి సర్టిఫికెట్లు ఇచ్చే మౌలిక వ్యవస్థ అరకొరగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. మరో అధ్యయనం ప్రకారం ముస్లింలు, మహిళలు ఈ తొలగింపులకు గురైన వారిలో అధిక నిష్పత్తిలో ఉన్నారని తేలింది. లోతుగా పాతుకుపోయిన సామాజిక అసమానతలు, సాధికారతలో తీవ్రమైన హెచ్చుతగ్గులను ప్రతిబింబించే పరిస్థితి ఇది.

దొరికిపోయిన ఘరానా

ఈలోగా మరో విధ్వంసకరమైన అంశం బయటపడింది. సేకరించిన అధికార సాక్ష్యాధారాల ఆధారంగానే ఇది బయట పెట్టబడింది. బెంగళూరు లోని ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో మున్నెన్నడూ లేని స్థాయిలో మోసపూరిత ఓట్ల నమోదు బయటపడింది. ఇది ఇ.సి.ఐ విశ్వసనీయతకు చివరి చావు దెబ్బగా పరిణమించింది. ఆ తర్వాత లోక్‌నీతి-సి.ఎస్.డి.ఎస్ అధ్యయనం కూడా దీన్ని ధ్రువపరిచింది. ఫలితంగా ప్రజల దృష్టిలో ఇ.సి.ఐ పట్ల నమ్మకం ప్రమాదకరంగా హరించుకుపోయింది.

ఇ.సి.ఐ వ్యవస్థాగత విశ్వసనీయత ఇంకా ఏమైనా మిగిలి ఉంటే ఆగస్టు 17న దాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ సి.ఇ.సి జ్ఞానేశ్ కుమార్ చేతులారా ఆఖరి దెబ్బకొట్టారు. పతిపక్షాలపై తీవ్ర దాడి చేసే విధంగా పక్షపాత పూరితమైన జోక్యానికి పాల్పడుతూ వచ్చి అబద్ధాలను గుమ్మరించారు. కమిషన్‌కు, బిజెపి కి మధ్యలో కుమ్మక్కు ఏమిటో ఇంత తేలిగ్గా మరెవరూ బయట పెట్టలేదేమో.


ఇప్పుడు ఇక పోరాటం ప్రజా ప్రాంగణంలోనే ఉంది. బీహార్ పౌరుల ఓటు హక్కులను కాపాడటం కోసం ఆగస్టు 17న ప్రారంభించిన 'ఓట్ అధికార యాత్ర' సెప్టెంబర్ 1న పాట్నాలో ముగుస్తుంది. ఈ మధ్యకాలంలో...స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థను ధ్వంసం చేయడానికి, పౌరుల అతి విలువైన రాజ్యాంగ హక్కుగా ఉన్న ఓటు హక్కును హరించడానికి జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజలు దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం చేయాలి.

/ ఆగస్టు 20 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం /

వి. రాంభూపాల్

బాధ్యత మరుస్తున్న ఎమ్మెల్యేలు

ప్రభుత్వ ఆస్తులు, సహజ వనరులు, కాంట్రాక్టులు సులభంగా పొందడానికి రాజకీయాలు రాజమార్గంగా భావిస్తున్నారు. అందుకే ఇలాంటి వారు ఎన్నికల ముందు సీటు కొనేసి రాజకీయ నాయకులుగా అవతరిస్తున్నారు. అధికారం కోసం పోటీ పడుతున్న పార్టీలకు ఇలాంటి వారు పరమపద సోపానానికి నిచ్చెనలాగా కనిపిస్తున్నారు. పార్టీకి ఎంత ఇవ్వగలరు, ఎంత ఖర్చు పెట్టగలరు అని చూస్తున్నారే తప్ప, పార్టీ కోసం, ప్రజల కోసం పని చేశాడా లేదా, ప్రజల్లో మంచి పేరు వుందా లేదా అన్నవి పట్టించుకోవడంలేదు. ఇలాంటి వారు పార్టీకి, ప్రజలకు బద్ధులుగా ఎలా వుంటారు? అందుకే డబ్బు సంపాదన కోసం, అధికారాన్ని చెలాయించడం కోసం ఎంతకైనా తెగబడుతున్నారు. చట్టసభల్లో ప్రజా సమస్యలు వినిపించాలనే స్పృహ, తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామన్న తపనకంటే 'నాకేంటి' అనుకునే ధోరణి ఇంతింతై వటుడంతై అన్నట్లుగా దాదాపు అందరిలో బలపడిపోతోంది.



మన రాష్ట్రంలో రోజుకో ఎమ్మెల్యే మీడియా ప్రధాన శీర్షికలకు ఎక్కుతున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసి, చట్టాలను పరిరక్షించి, ఆదర్శవంతమైన కార్యక్రమాల ద్వారా వార్తల్లోకి ఎక్కే రోజులు పోయి చాలకాలమైంది. మా ఎమ్మెల్యే మంచి చేస్తాడన్న ఆశ కన్నా, చెడు చేయకపోతే చాలు అని ప్రజలు కోరుకునే స్థాయికి పాలక రాజకీయాలు దిగజారిపోయాయి. గత కొద్ది రోజులుగా మన రాష్ట్రంలోని కొందరు ఎమ్మెల్యేల ప్రవర్తన సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే విధంగా వుంది. ఒకరు మహిళా ప్రిన్సిపల్‌ను వేధించగా, మరొకరు అసభ్యకరమైన వీడియో కాల్ చేయగా, ఇంకొకరు ఫోన్ కాల్‌లో ప్రముఖ సినీ నటుడి తల్లిని అత్యంత నీచంగా మాట్లాడారు. రిమాండ్‌లో వున్న రౌడీ షీటర్ పెరోల్ కోసం ఇద్దరు ఎమ్మెల్యేలు సిఫార్సు చేస్తే, ఓ మంత్రి గారి కార్యాలయం అందుకు సహకరించింది. తాజాగా ఫారెస్టు అధికారులపై ఇంకో ఎమ్మెల్యే దాడికి తెగబడ్డారు. ఇవన్నీ ఆధారాలతో వెలుగులోకి వచ్చిన సంఘటనలు. డబ్బు కోసం రియల్ ఏస్టేట్ వారిని, వ్యాపార సంస్థలను, అధికారులను బెదిరిస్తున్న వార్తలు నిత్యదర్శనంగా మారాయి. భూ ఆక్రమణలు, కాంట్రాక్టుల్లో వాటాలు, బదలీలల్లో లంచాలు, మద్యం, ఇసుక, మట్టి అక్రమ వ్యాపారాలు ఎమ్మెల్యేల గుమ్మాలకు పచ్చ తోరణాలుగా మారుతున్నాయి. కూటమి నేతలు అధికారంలోకి రావాలని మనసా వాచ కర్మేణ కోరుకున్న మీడియా సంస్థలు సైతం జీర్ణించుకోలేనంత బకాసురులుగా కొందరు ఎమ్మెల్యేలు ఎదిగిపోయారు. బాగోతాలు బట్టబయలైన ఎమ్మెల్యేలను పార్టీ అధినేతలు ఒకవైపు మందలిస్తుండగానే మరోవైపు ఇంకొన్ని ఘటనలు జరిగిపోతున్నాయి. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ సంఘటనలపై సీరియస్‌గా చర్చ జరిగినట్లు, కొందరిని గట్టిగా మందలించినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పటికే 30 మంది ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి ఇలా పిలిచి మాట్లాడారు. ఇంకా చాలా మంది ఈ క్యూలో వున్నారట.

వెనుకటి బుద్ధులు

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒంటరి మహిళల బదిలీల విషయంలో తనకు అన్యాయం చేయడమే కాక, తనను వేధింపులకు గురిచేశారని మహిళా ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్యే అనుచరులు ఆమెను సోషల్ మీడియాలో అసభ్యంగా ట్రోలింగ్ చేసారు. దీంతో ఆమె ఆత్మహత్యా యత్నం చేసుకుంది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ మహిళా నాయకురాలికి వీడియో కాల్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వార్తలు వచ్చాయి. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్ సినిమా విషయంలో ఆ పార్టీ కార్యకర్తతో మాట్లాడిన ఆడియో సంచలనమైంది. అందులో జూనియర్ ఎన్టీఆర్‌ను, ఆయన తల్లిని అత్యంత నీచంగా మాట్లాడాడు. గత ప్రభుత్వ హయాంలో కూడా మహిళల పట్ల ఇలా ప్రవర్తించిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కొందరు వున్నారు. గోరంట్ల మాధవ్ విషయం అప్పట్లో సంచలనం అయ్యింది. ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రుల కుటుంబాల్లోని మహిళలపై కూడా అసభ్యకర ప్రకటనలు, పోస్టింగ్‌లు వైరల్ అయ్యాయి. మహిళల పట్ల ఇలా ప్రవర్తించిన సంఘటనలు బహిర్గతమైన తర్వాతనైనా నైతిక బాధ్యత వహించడం కాకుండా బుకాయించేస్తున్నారు. తమ అనుచరుల ద్వారా బాధితులపై సోషల్ మీడియాల్లో, ఇతర రూపాల్లో ఎదురుదాడి చేయిస్తున్నారు. బెదిరింపులకు తెగబడుతున్నారు. ఇలాంటి సంఘటనల్లో పార్టీ ఆధిష్టానాలు కఠిన చర్యలు తీసుకోకుండా కంటితుడుపు మందలింపులతో సరిపుచ్చుతున్నారు. పార్టీకి నష్టం రాకుండా చూసుకునే ప్రయత్నాలు చేస్తున్నారే కాని, మహిళలకు జరిగిన అన్యాయానికి, అవమానాలకు తగ్గట్టు శిక్షలు వేయడంలేదు. ఈ వికృత చర్యలకు మూలాలు తరాల నాటి పురుషాధిక్యతలో, స్త్రీలను అంగడి సరుకుగా చూసే వ్యాపార భావజాలంలో వున్నాయి. భారతమాత, గోమాత, ధర్మ పరిరక్షణ అంటూ జపం చేసే కొందరు నేతల బుద్ధులు వేమన చెప్పినట్లు 'కనకపు సింహాసనం ఎక్కిన...వెనకటి బుద్ధి ఏలా మాను' అన్నట్లుగా వుంది. 543 మంది వున్న పార్లమెంట్‌లో 251 మందిపై క్రిమినల్ కేసులు వున్నాయి. ఇందులో 170 మంది మీద అంటే 31 శాతం ఎంపీల మీద మానభంగం, హత్య, కిడ్నాప్ లాంటి తీవ్ర నేరాలు వున్నాయి. మహిళలను కించపరచిన, అత్యాచారం, వేధింపులకు పాల్పడిన ప్రజాప్రతినిధుల సభ్యత్వం తక్షణం రద్దు అయ్యే విధంగా చట్టాలను రూపొందించాలని మహిళా సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి.

అధికార దర్పం

నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మహిళా ఎమ్మెల్యే తనకు రక్షణగా వుండాల్సిన గన్‌మెన్‌తో హ్యాండ్ బ్యాగ్ మోయించడం, కడప జిల్లాకు చెందిన మరో మహిళా ఎమ్మెల్యే స్వాతంత్ర్య దినోత్సవం నాడు తన దర్పానికి తగ్గట్టుగా కుర్చీ వేయలేదని ఐ.ఎ.ఎస్ అధికారులను అందరి ముందు గద్దించడం, తిరువూరు ఎమ్మెల్యే నిత్యవివాదస్పదుగా మారడం, శ్రీశైలం ఎమ్మెల్యే ఫారెస్టు నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా ఏకంగా వారి జీపులోకి జొరబడి ఆటవిక దాడి చేయడం అధికార దర్పానికి నిదర్శనాలు. ప్రజాప్రతినిధులే కాదు వారి కుటుంబ సభ్యులు కూడా అధికారులను నోటికొచ్చినట్టు తిట్టడం, బహిరంగంగా కొట్టడం లాంటి సంఘటనలు అనేకం ఇటీవల జరిగాయి. మీ పరిధిలోని ఎమ్మెల్యేలను కట్టడి చేయలేరా అని మంత్రులను ముఖ్యమంత్రి నిలదీసినట్లు వార్తలు వచ్చాయి. మంత్రుల్లో ఎంతమందికి అలా కట్టడి చేసే శక్తి వుందో ముఖ్యమంత్రికి తెలియదు అనుకోగలమా? ఓ మంత్రిగారి భార్య పోలీసులకు టార్గెట్లు పెట్టి వసూళ్లు చేసుకుంటారని, కొద్దిమంది మంత్రులు హైదరాబాద్‌లో ఆఫీసులు ప్రారంభించి వసూళ్లు చేసుకుంటున్నారని వార్తలు వస్తూనే వున్నాయి. ఎన్నికల ముందు ఇతర పార్టీ నుండి చేరినవారి వల్ల టిడిపి కి ఈ పరిస్థితి వచ్చినట్లు కొందరి భావన. అది నిజమా, కాదా అన్నది కాదు, అలా చేర్చుకోవడానికి కారణం ఏమిటీ? నాలుగున్నరేళ్ల ఇష్టం వచ్చినట్లు విమర్శించిన వారిపై చివరి నెలల్లో పార్టీ అధినేతలకు వీరిపై అంత ప్రేమ పుట్టడానికి కారణం డబ్బు, గెలుపే కదా! సమస్యకు మూలం అధిష్టానంలో వుంటే కింద ఎవరినో నిందిస్తే ఏం ప్రయోజనం? అధికారంలోకి రావడం కోసం విధానాలను, విలువలను గాలికొదలి ఎమ్మెల్యేలను ఎలా కట్టడి చేస్తారు?

డబ్బు రాజకీయాలు

సభ్య సమాజంలో జీవించే ప్రతి ఒక్కరూ ఆ నాటి సమాజం అంగీకరించిన కనీస విలువలను, పద్ధతులను పాటించడం నైతికత. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈ నైతికతను ఆచరించడంలో మరింత ఆదర్శనీయంగా వుండాలి. అందుకే 'యథా రాజ తథా ప్రజా' అనే నానుడి వచ్చింది. ప్రజాప్రతినిధులు అనుభవించే హోదా, వారు తీసుకుంటున్న వేతనాలు, పొందుతున్న సౌకర్యాలన్నీ ప్రజల నుండి అందుతున్నవే. అందుకే 'చట్టసభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా వుండాలి' అని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అందుకు అవసరమైన విధి విధానాలను, నైతిక బాధ్యతలను రూపొందించారు. వ్యాపారీకరణ విధానాలు అమలవుతున్న గత మూడు దశాబ్దాల్లో రాజకీయాల్లో ఈ విలువలు తీవ్రంగా పతనమవుతున్నాయి. చట్టసభల సమావేశాలు, అర్థవంతమైన చర్చలు, ప్రజాభివృద్ధి దిశగా విధానాలు రూపొందించడంలో ప్రజాప్రతినిధుల పాత్ర రోజురోజుకు కుదించుకుపోతోంది. అందుకు ప్రజాప్రతినిధులు ఆందోళన చెందడంలేదు. ప్రభుత్వ ఆస్తులు, సహజ వనరులు, కాంట్రాక్టులు సులభంగా పొందడానికి రాజకీయాలు రాజమార్గంగా భావిస్తున్నారు. అందుకే ఇలాంటి వారు ఎన్నికల ముందు సీటు కొనేసి రాజకీయ నాయకులుగా అవతరిస్తున్నారు. అధికారం కోసం పోటీ పడుతున్న పార్టీలకు ఇలాంటి వారు పరమపద సోపానానికి నిచ్చెనలాగా కనిపిస్తున్నారు. పార్టీకి ఎంత ఇవ్వగలరు, ఎంత ఖర్చు పెట్టగలరు అని చూస్తున్నారే తప్ప, పార్టీ కోసం, ప్రజల కోసం పని చేశాడా లేదా, ప్రజల్లో మంచి పేరు వుందా లేదా అన్నవి పట్టించుకోవడంలేదు. ఇలాంటి వారు పార్టీకి, ప్రజలకు బద్ధులుగా ఎలా వుంటారు? అందుకే డబ్బు సంపాదన కోసం, అధికారాన్ని చెలాయించడం కోసం ఎంతకైనా తెగబడుతున్నారు. చట్టసభల్లో ప్రజా సమస్యలు వినిపించాలనే స్పృహ, తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామన్న తపనకంటే 'నాకేంటి' అనుకునే ధోరణి ఇంతింతై వటుడంతై అన్నట్లుగా దాదాపు అందరిలో బలపడిపోతోంది. 2024 లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో ఏకంగా 93 శాతం మంది కోటీశ్వరులే ఉన్నారని 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' సంస్థ ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో విధానాలకు కట్టుబడిన కమ్యూనిస్టు పార్టీలు, నీతి, నిజాయితీ, విలువలతో కూడిన వ్యక్తులు ఎన్నికల్లో పోటి పడడం, గెలవడం అసాధ్యంగా మారుతున్నది.

చులకన భావం

తాము అధికారంలో వుండడానికి ప్రజల ఓట్లు కీలకమన్న సంగతి గెలిచిన రోజునే కొందరు మరచిపోతున్నారు. తాము చేసే పనులను, మాటలను ప్రజలు గమనిస్తారనే కనీస స్పృహ వున్నా ఇలా ప్రవర్తించరు. ప్రజలకు జ్ఞాపకశక్తి వుండదని, వారు కేవలం ఓట్లు అమ్ముకునే వారనే చులకన భావం ఈ వికృత ప్రవర్తనలకు మరో కారణం. ఒకప్పుడు మీడియాల్లో వ్యతిరేక వార్తలు వస్తే నేతలు భయపడేవారు. అందుకు జవాబు చెప్పుకునేందుకు కనీసం ప్రయత్నించేవారు. ప్రధాన మీడియా సంస్థలు పాలక రాజకీయ పార్టీల శిబిరాల్లో చేరిపోవడంతో మీడియా పట్ల పాలకుల్లో తేలికభావం పెరిగిపోతోంది. నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన అధికార యంత్రాంగం ఎమ్మెల్యేలు, ఎంపీల అదుపాజ్ఞల్లో బందీ అయిపోయింది. ఉద్యోగుల పోస్టింగ్, బదిలీ, ప్రమోషన్లు అన్నింటిలో అధికార పార్టీ నేతల ఆదేశాలే చెల్లుబాటు అవుతున్నాయి. అందుకే అధికారులు వీరి చుట్టూ పరిభ్రమిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే ఎన్నికల విధానంలో సమూల మార్పులు రావాలి. ముఖ్యంగా ఎన్నికల్లో డబ్బు పాత్రను నివారించాలి. అందుకు దామాషా ప్రాతినిధ్య పద్ధతి అమలు చేయాలి. ప్రతి ఓటుకు విలువ వుండే విధంగా చూడాలి. ఎన్నికల్లో ఖర్చులపై ఖచ్చితమైన నియంత్రణ వుండాలి. తప్పు చేసిన ప్రజా ప్రతినిధిని చట్టసభల నుండి వెనక్కి పిలిపించుకునే అవకాశం ఉండాలి. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజా ఉద్యమాల ఒత్తిడి పెంచాలి.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్

ముంబయి : చాలా కాలం తర్వాత వరుసగా ఆరు సెషన్లలో లాభాల్లో సాగిన భారత స్టాక్ మార్కెట్లు వారాంతం సెషన్‌లో కుప్పకూలాయి. ఫైనాన్సీయల్, ఐటి షేర్లలో అమ్మకాల ఒత్తిడితో శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 694 పాయింట్లు కోల్పోయి 81,307కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 213.65 పాయింట్ల పతనంతో 24,870 వద్ద ముగిసింది. ట్రంప్ అదనంగా విధించిన 25 శాతం టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో మొత్తం సుంకాలు 50 శాతానికి చేరనుండటంతో ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశంలో వడ్డీ రేట్లపై నెలకొన్న సందిగ్ధత నేపథ్యంలో మదుపర్లు ముందు జాగ్రత్తగా అమ్మకాలకు మొగ్గు చూపారు.

త్వరలోనే భారత్‌లో ఓపెన్ ఎఐ ఆఫీసు ఏర్పాటు

న్యూఢిల్లీ : చాట్‌జిపిటి మాతృసంస్థ ఓపెన్ ఎఐ తన కార్యకలాపాలను భారత్‌లోకి విస్తరించనుంది. త్వరలోనే ఇక్కడ తన సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది చివరి కల్లా న్యూఢిల్లీలో కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపింది. చాట్‌జీపీటీ వినియోగం 4 రెట్లు పెరగడం, అమెరికా తర్వాత రెండో అతిపెద్ద మార్కెట్‌గా భారత్ నిలవడంతో ఇక్కడి కార్యకలాపాలపై దృష్టి సారించింది. భారత్‌లో చాట్‌జిపిటి గో పేరుతో ఓపెన్ ఎఐ సేవలను రూ.399కే అందించనున్నట్లు తెలిపింది.

చంద్రబాబువి తాటాకు చప్పుళ్లు

- ఎమ్మెల్యేల అరాచకాలకు కొమ్ముకాస్తున్నారు
- వైసిపి నేత పోతిన మహేష్ ఆరోపణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి ఎమ్మెల్యేలు చేస్తున్న అరాచకాలకు చంద్రబాబు కొమ్ముకాస్తున్నారని, ఆయన హెచ్చరికలను ఎవరూ లెక్కల చేయడం లేదని, అవన్నీ తాటాకు చప్పుళ్లేనని వైసిపి గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు పోతిన వెంకట మహేష్ ఆరోపించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వివాదస్పద ఎమ్మెల్యేలపై క్యాబినెట్లో సిఎం ఆగ్రహం అంతా డ్రామా అని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఎమ్మెల్యే ఆగడాలు పెచ్చుమీరాయని, పవణ్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా స్వప్రయోజనాలకే పరిమితం అయ్యారని అన్నారు. కనీసం సినిమా కార్మికుల సమస్యలు కూడా చర్చించలేని బలహీనస్థితిలో ఉన్నారని విమర్శించారు. అటవీశాఖ అధికారులను అర్ధరాత్రి వరకూ తిప్పుతూ కొట్టినా కనీసం మందలించలేని అసమర్థ స్థితిలో సిఎం ఉన్నారని పేర్కొన్నారు.

పెరోల్ విషయంలో అనిత దోషి

జీవితఖైది శ్రీకాంత్ పెరోల్ విషయంలో హోమ్‌శాఖ మంత్రి అనిత దోషి అని వైసిపి ఎస్‌సిసెల్ వర్కింగు ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు అన్నారు. జాయింట్ సెక్రటరీ నిరాకరించినా అనిత పెరోల్‌కోసం పట్టుబట్టారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందని తెలిపారు. శ్రీకాంత్ చేస్తున్న అరాచకాలకు టిడిపి అండగా ఉందన్నారు.

రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన చంద్రబాబు : కాకాణి

రైతు సంక్షేమాన్ని చంద్రబాబునాయుడు పూర్తిగా గాలికొదిలేశారని, దోచుకోవడం దాచుకోవడం తప్ప మరో ప్రాధాన్యత లేదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మట్లాడారు. భారీవర్షాలు, మరోవైపు అనావృష్టితో రైతులు అవస్థలు పడుతున్నారని పట్టించుకోవడం లేదన్నారు.

ఆకాశమే హద్దుగా పనిచేయాలి : సజ్జల

ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంతో వైసిపి ప్రచార విభాగం ఆకాశమే హద్దుగా పనిచేయాలని వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వింగ్ అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్ ఆధ్వర్యాన శుక్రవారం సమావేశం జరిగింది. దీనికి వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాదరెడ్డి తదితరులు హాజరయ్యారు.

కాకాణి బెయిల్ ఉత్తర్వుల్లో సవరణ

ప్రజాశక్తి, అమరావతి

అక్రమ మైనింగ్ కేసులో వైసిపి నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి గతంలో ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను శుక్రవారం హైకోర్టు సవరించింది. పోలీసులు చార్జిషీట్ దాఖలు వరకు నెల్లూరు జిల్లాకు వెళ్లరాదన్న షరతుపై స్టే విధించింది. ప్రతి ఆదివారం ఉదయం 10 నుండి సాయంత్ర 5 లోపు దర్యాప్తు అధికారి ఎదుట హాజరయ్యేందుకు ఆ షరతు అవరోధంగా ఉందని కాకాణి వేసిన పిటిషన్‌లో జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ఇతర కేసుల్లో కాకాణి విషయంలో కోర్టులు విధించిన షరతులను పరిశీలన చేస్తామన్నారు. నెల్లూరు జిల్లాలోకి అడుగుపెట్టకూడదన్న షరతుపై స్టే విధిస్తూ ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లాటరీ జరగకపోతే ఫీజు వాపస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్త బార్ పాలసీలో ఏదైనా బార్‌కు నాలుగు దరఖాస్తులు రాకపోవడం వల్ల, లేక లాటరీ జరగకపోతే అభ్యర్థులు చెల్లించిన దరఖాస్తు రుసుము వెనక్కి ఇస్తామని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్ వెల్లడించారు. కొత్త పాలసీ ప్రకారం ఒక బార్‌కు కనీసం 4 దరఖాస్తులు రావాలనే నిబంధన ఉందని, అనివార్య కారణాల వల్ల 4 రాకపోతే లాటరీ నిలిపివేసి తేదీని పొడిగిస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి పక్షంలో దరఖాస్తుదారుల ఫీజు రూ.5 లక్షలు వెనక్కి ఇస్తామన్నారు.

ఖాతాల మార్పుపై సమస్యలను నివృత్తి చేయండి

● మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల వేతనాల బ్యాంక్ ఖాతాలను యాక్సిస్ బ్యాంక్‌కు మార్చడం వల్ల ఎదురయ్యే సమస్యలను నివృత్తి చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణకు, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు శుక్రవారం లేఖ రాశారు. ప్రస్తుతం ఎస్‌బిఐ, యుబిఐ, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర బ్యాంకుల్లో కొనసాగుతున్న కార్మికుల ఖాతాలను కొనసాగించాలన్నారు. వీటిని యాక్సిస్ బ్యాంక్‌కు మార్చడం వల్ల ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. క్రెడిట్ కార్డు తప్పనిసరి అయితే, పెద్దగా చదువు లేని కార్మికులు లావాదేవీలు నిర్వహించే సమయంలో మోసపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యలపై కార్మికులకు స్పష్టత ఇవ్వాలని లేఖలో కోరారు.

రోల్‌మోడల్‌గా నైపుణ్యం పోర్టల్ అభివృద్ధి : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ,ఉపాధి కల్పన కోసం యువత, పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురానున్న నైపుణ్యం పోర్టల్‌ను దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం నైపుణ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్‌లోగా నైపుణ్యం పోర్టల్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. కాగా దృష్టిలోపం ఉన్న విద్యార్థులను ఇంటర్మీడియట్‌లో ఎంపిసి, బైపిసి కోర్సుల్లో చేరేందుకు అనుమతిని మంత్రి మంజూరు చేశారు. ఈ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి, సిఇఓ జి గణేష్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాబు, పవన్, జగన్ ముగ్గురూ మోడీ తొత్తులే : షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని, వీరు ముగ్గురు మోడీకి తొత్తులేనని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థికి వైసిపి మద్దతు ఇవ్వడాన్ని ఆమె తప్పుబట్టారు. అవినీతి కేసులకు బయపడి మళ్లీ బిజెపికి దాసోహమయ్యారని పేర్కొన్నారు. వైసిపి ముసుగు మళ్లీ తొలగిందని, లోపలున్న కాషాయ కండువా మరోసారి బయటపడిందన్నారు. మోడీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంటే విమర్శించడానికి వైసిపికి నోరు పెగలడం లేదన్నారు. గోద్రా తరహాలో మణిపూర్‌లోనూ సంఘ్ పరివార్ రక్తపాతం పారిస్తుంటే కనీసం ఖండించడం కూడా లేదన్నారు.

ఆగమ సలహా మండలి సభ్యుల రాజీనామా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2023లో నియమితులైన ఆగమ సలహా మండలి ఛైర్మన్, ఏడుగురు సభ్యుల రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు శుక్రవారం జీఓఆర్‌టి నెంబరు 907ని ప్రభుత్వం విడుదల చేసింది. ఎండోమెంట్ కమిషనరుకు, హిందూ ధర్మ ఆగమ విషయాల్లో సలహాలు ఇవ్వడానికి వీరిని గత ప్రభుత్వం నియమించింది.

ఆలయాలపై వైసిపి విషప్రచారం

● మంత్రి ఆనం ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆలయాలపై వైసిపి విషప్రచారం చేయడం బాధాకరమని దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ద్వేషపూరిత ధోరణితో ఆలయాల పాలకమండళ్లపై వైసిపి నేతలు ఆరోపణలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోపిడీ, అవినీతి బాగోతాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే వైసిపి డైవర్షన్ రాజకీయాలు చేస్తోందన్నారు. వైసిపికి ఉన్న 11 మంది ఎమ్మెల్యేల్లో సగం మంది జైళ్లలో ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చునని ఆయన అన్నారు.

50 షోరూంలకు విస్తరించిన ఒబెన్ ఎలక్ట్రిక్

హైదరాబాద్ : విద్యుత్ మోటార్ సైకిల్ తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ దేశంలో 50 షోరూంలకు విస్తరించినట్లు వెల్లడించింది. విశాఖపట్నంలో నూతన షోరూం, సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా ఈ మైలురాయిని చేరామని ఆ కంపెనీ ఫౌండర్, సిఇఒ మధుమిత అగర్వాల్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలోని 15 రాష్ట్రాలు, 37 నగరాలకు తమ కార్యకలాపాలను విస్తరించామన్నారు. తమ ఒబెన్ రోర్ ఇజెడ్, కొత్తగా ప్రవేశపెట్టిన రోర్ ఇజెడ్ సిగ్మాకు బలమైన డిమాండ్ లభించడంతో వేగవంతమైన విస్తరణపై దృష్టి పెట్టామన్నారు.

ప్రతిపక్షాలపై దాడులు కోసమే!

130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సిపిఎం ప్రధాన కార్యదర్శి బేబీ విమర్శ



న్యూఢిల్లీ : ప్రతిపక్షాలపై ప్రతీకారేచ్ఛతో దాడులు చేయడానికే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చారు తప్ప అవినీతిని అంతమొందించడానికి కాదని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు రాసిన కాలమ్‌లో ఈ బిల్లుపై తన అభిప్రాయాలు పంచుకున్నారు.

"ప్రజా ప్రయోజనాలు, సంక్షేమం, సుపరిపాలన" పేరుతో ప్రవేశపెట్టిన రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు – 2025, వాస్తవానికి ప్రతిపక్షాల నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు, భారతదేశ ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీసేందుకు ఉద్దేశించిన నిరంకుశ చట్టం. ప్రతిపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్న ఈ ప్రతీకార రాజకీయాల శకంలో నీచపుటెత్తుగడల కోసం, చట్టాలను దుర్వినియోగం చేయడానికి వీలుగా నిబంధనలు రూపొందించబడ్డాయి. "రాజ్యాంగ నైతికత" గురించి ఈ బిల్లులో ప్రస్తావించడం దీని స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా వుంది. ఎందుకంటే, కేవలం అభియోగాలు లేదా అరెస్టుల ప్రాతిపదికన కాకుండా కోర్టులు చేసే నేర నిరూపణలతోనే అనర్హత, శిక్షలు ముడిపడి వుండాలనే స్థిర సూత్రం నుండి ఈ బిల్లు పూర్తిగా పక్కకు వైదొలగుతోంది. ఈ సూత్రం ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్‌పిఎ), 1951 లోని సెక్షన్ 8లో స్పష్టంగా పొందుపరచబడింది. వ్యక్తులపై సులభంగా అభియోగాలు మోపడం, అరెస్టు చేయడం, నిర్బంధించడం, ఆ నిర్బంధాలను పొడిగిస్తూ పోవడం జరుగుతున్న ఈనాటి అత్యంత ప్రమాదకరమైన రాజకీయ వాతావరణంలో, ఈ బిల్లు కచ్చితంగా రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి, ప్రజాస్వామ్య ప్రమాణాలను తుడిచిపెట్టడానికి ఒక ఆయుధంగా మారుతుంది.

భారత రాజ్యాంగంలోని 75, 164, 239 ఎఎ అధికరణలు మంత్రుల నియామకాలు, తొలగింపునకు సంబంధించిన విధానాలు, ముందస్తు షరతులను సవివరంగా పేర్కొంటున్నాయి. పైగా అటువంటి అధికారాలు 'ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి'కి, 'ముఖ్యమంత్రి సూచన మేరకు గవర్నర్'లకు అప్పగించబడ్డాయి. ప్రస్తుత సవరణ ఈ రాజ్యాంగ ఉద్దేశాన్ని ఉల్లంఘిస్తోంది. చట్టం ముందు సమానత్వం, భావ ప్రకటనా స్వేచ్ఛ, అనుసరించాల్సిన ప్రక్రియ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలు 14, 19, 21 అధికరణల్లో పొందుపరచబడ్డాయి. నిరూపితం కాని క్రిమినల్ ఆరోపణలపై ఆటోమేటిక్‌గా తొలగించబడడం ఈ హామీలన్నింటినీ ఉల్లంఘిస్తోంది. నేరారోపణకు గురైన వ్యక్తి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే అవకాశాన్ని లేకుండా చేస్తోంది. ఈ బిల్లులో కనీసం నిర్దిష్ట కాలపరిమితి (సన్‌సెట్ క్లాజు) లేదా సమీక్షా క్లాజు కూడా లేదు. ఒకసారి తొలగిస్తే, సదరు మంత్రి ఒకవేళ నిర్దోషిగా తేలినా లేదా 30 రోజుల కాల పరిమితి తర్వాత బెయిల్ మంజూరైనా తిరిగి ఆటోమేటిక్‌గా ఆ పదవిని పొందలేరు. ఒకవేళ అరెస్టు దురుద్దేశంతో జరిగిందని తేలినట్లైతే నష్టపరిహారానికి ఎలాంటి నిబంధన లేదు. వాస్తవానికి, ఇది కేవలం ముందస్తు నిర్బంధాన్ని, యుఎపిఎ వంటి చట్టాల దుర్వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది.

ఇక కేంద్ర సంస్థలకు సంబంధించినంత వరకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రస్తుత పాలక పక్షానికి అత్యంత ఇష్టమైన పెంపుడు కుక్క వంటిది. అయితే, ఇడికి చాలా పేలవమైన రికార్డు వుంది. గత ఐదేళ్ళ కాలంలో కేవలం 38 కేసుల్లో నేర నిరూపణలు జరిగాయి. ఇంత తక్కువగా నేర నిరూపణ రేటు వుందంటే అనేక కేసులు అసలు విచారణా దశ వరకు కూడా వెళ్లడం లేదనే వాస్తవం బహిర్గతమవుతోంది. 2014 నుండి 2022 మధ్య కాలంలో ఇడి దర్యాప్తు ఎదుర్కొన్న ప్రముఖ రాజకీయ నేతల్లో 95శాతం మంది ప్రతిపక్ష నేతలే. పిఎంఎల్‌ఎ కింద బెయిల్ రావడం చాలా అరుదు, ఇందుకు ముఖ్యంగా సెక్షన్ 45 కింద నెరవేరాల్సిన రెండు ప్రధానమైన షరతులే కారణం. అవి, ఒకటి – బెయిల్ దరఖాస్తును వ్యతిరేకించే అవకాశం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు వుండడం, రెండు – ఆ వ్యక్తి దోషి కాదని బెయిల్‌పై వున్నప్పుడు ఎలాంటి నేరానికి పాల్పడబోడని కోర్టు సంతృప్తి చెందడం. ఈ బిల్లు చట్టంగా మారితే ఇటువంటి అతిక్రమణలు మరింత పెరుగుతాయి !

ఈ బిల్లుకు వ్యతిరేకంగా నాలుగు తీవ్రమైన అభ్యంతరాలు లేవనెత్తాలి. ఒకటి, అమాయకత్వ భావనను ఇది ఉల్లంఘిస్తోంది. నేర నిరూపణ జరిగిన తర్వాత కాకుండా, కేవలం అరెస్టుల ప్రాతిపదికనే మంత్రులను శిక్షిస్తోంది. దీనివల్ల "దోషిగా తేలేవరకు అమాయకుడే" అనే రాజ్యాంగపరమైన హామీ ధ్వంసమవుతోంది. పైగా ప్రతీకారేచ్ఛకు పాలనాపరమైన ఆయుధాన్ని సృష్టిస్తోంది. రెండవది, అధికారాల విభజనను ఇది అతిక్రమిస్తోంది. పార్లమెంటరీ, న్యాయపరమైన పర్యవేక్షణను పక్కకునెట్టి ఆటోమేటిక్‌గా తొలగింపు జరుగుతుంది. కార్యనిర్వాహకవర్గం చేతుల్లోనే అపరిమిత అధికారాలన్నీ కేంద్రీకృతమవుతాయి. మౌలిక రాజ్యాంగ తనిఖీలను ఉల్లంఘిస్తుంది. మూడవది, అనుసరించాల్సిన ప్రక్రియ నిరాకరించబడుతుంది. విచారణ, అభియోగాల నమోదు, లేదా జ్యుడీషియల్ నిర్ధారణలు లేకుండానే తొలగించడం అనేది మొత్తంగా అనుసరించాల్సిన ప్రక్రియను –రామేశ్వర్ ప్రసాద్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో చోటు చేసుకున్నట్లుగా – అతిక్రమిస్తుంది. ఇక నాల్గవది, రాజకీయ దుర్వినియోగానికి ఒక వేదికను సృష్టిస్తుంది. కేంద్ర సంస్థలు ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడమనేది ప్రస్తుతం బాగా అమలవుతున్న ధోరణి, దీని కింద ఈ బిల్లు పరిశుద్ధ పాలనను పెంచి పోషించడానికి బదులుగా ప్రతీకారేచ్ఛను రాజ్యాంగబద్ధం చేసే ప్రమాదముంది.

ఈ బిల్లు భారతదేశ రాజ్యాంగ నిర్మాణంపై అనూహ్యమైన రీతిలో దాడి జరుపుతోంది. ప్రతిపక్షాలను, మన ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకు మోడీ ప్రభుత్వం నిరంకుశంగా చేపట్టిన చర్య యొక్క వ్యక్తీకరణే ఈ బిల్లు. వారి నయా ఫాసిస్ట్ స్వభావాలను ఈ బిల్లు ప్రదర్శిస్తోంది. కేవలం అరెస్టయ్యారని, విచారణకు ముందు కస్టడీలోకి తీసుకున్నారనే కారణాలతో ప్రధానిని, ముఖ్యమంత్రిని లేదా మంత్రులను ఆటోమేటిక్‌గా తొలగించడానికి వెసులుబాటు కల్పించడం వల్ల అమాయకత్వ భావన, అనుసరించాల్సిన ప్రక్రియ గాలికెగిరిపోతున్నాయి. ఈ రెండు అంశాలు అర్థవంతమైన చట్టం, న్యాయ వ్యవస్థలకు కీలకమైన మైలురాళ్లు. ఈ బిల్లు కేంద్ర సంస్థలకు ఏకపక్షంగా అధికారాలిస్తోంది. ప్రతిపక్ష నేతలపై రాజ్యాంగబద్ధమైన ప్రతీకార చర్యలకు ద్వారాలు తెరుస్తోంది. ఇప్పటికే ప్రాసిక్యూషన్‌ను ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్న ధోరణి నెలకొని వుంది. దీనికి రాజ్యాంగబద్ధతను కల్పించేందుకు ఎంత మాత్రమూ అనుమతించరాదు.

3, 4 తేదీల్లో జిఎస్‌టి కౌన్సిల్ భేటీ

- రెండు స్లాబ్‌ల ప్రతిపాదనపై చర్చ

న్యూఢిల్లీ : గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జిఎస్‌టి) కౌన్సిల్ 56వ సమావేశం సెప్టెంబరు 3,4 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనుంది. ఈ విషయాన్ని కౌన్సిల్ శుక్రవారం రాత్రి జారీ చేసిన మెమోరాండంలో వెల్లడించింది. ఈ సమావేశంలో మంత్రుల గ్రూపు చేసిన సిఫార్సులపై చర్చించే అవకాశం ఉంది. ప్రధానంగా జిఎస్‌టి వ్యవస్థను రెండు స్లాబ్‌లుగా సంస్కరించే సిఫార్సును కూడా చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో జిఎస్‌టి సంస్కరణలు గురించి మాట్లాడారు. అదే రోజు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రెండు స్లాబుల జిఎస్‌టి వ్యవస్థ కోసం తన ప్రతిపాదనలను గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జిఒఎం)కు పంపింది. ఈ విషయాన్ని జిఒఎం చైర్‌పర్సన్, బీహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి గురువారం వెల్లడించారు. పూర్తిస్థాయిలో చర్చ లేకుండా ఈ ప్రతిపాదనను జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదించే అవకాశం లేదు. జిఒఎంలో ఒక సభ్యుడు, కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రతిపాదనలతో రాష్ట్రాల ఆదాయంపై ప్రభావం పడుతుందని, రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయని తెలిపారు.

ఆ చట్టం ఆమోదం పొందితే

అవినీతిపరులు పదవి కోల్పోవాల్సిందే : మోడీ

గయా: అవినీతికి వ్యతిరేకంగా తమ ప్రభుత్వం రూపొందించిన చట్టం అమలులోకి వస్తే ప్రధానమంత్రి అయినా, సిఎం అయినా జైలుకు వెళ్లిన 31వ రోజు పదవిని కోల్పోవాల్సిందేనని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. ప్రతిపక్షాలను వేధించేందుకే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చారని, అవినీతిని అంతమొందించేందుకు కాదని దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆ బిల్లును సమర్థించుకుంటూ ప్రధాని ప్రసంగించడం గమనార్హం. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద కట్టిన ఇళ్లకు గృహ ప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రభుత్వ ఉద్యోగిని 50 గంటల పాటు జైలులో వేస్తే, అప్పుడు ఆ వ్యక్తి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నాడు. అతను ఓ డ్రైవర్ అయినా, క్లర్క్ అయినా, ప్యూన్ అయినా .. జాబ్ పోతోంది. సిఎం, మంత్రులు.. జైలులోనే ఉంటూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. గతంలో కొందరు జైలు నుంచే ఫైళ్లపై సంతకాలు చేసేవారు. జైలు నుంచే ప్రభుత్వ ఆదేశాలు ఇచ్చేవారు. ఒక ప్రజానేతకు అటువంటి వ్యక్తిత్వం ఉంటే, అప్పుడు మనం అవినీతిని ఎలా ఎదుర్కొంటామని ప్రధాని ప్రశ్నించారు. పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన సమయంలో ఉగ్రవాదులను అణిచివేస్తామని ఇక్కడ నుంచే ప్రకటించామని, అనుకున్నట్టుగానే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరిందని అన్నారు. బీహారీ ప్రజలను ఆర్‌జెడి ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందన్నారు. బీహార్ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఎన్‌డిఎ సర్కారు ప్రయత్నిస్తోందని మోడీ చెప్పారు.

వక్ఫ్‌పై పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నో

న్యూఢిల్లీ : యుఎంఇఇడి పోర్టల్ కింద తప్పనిసరిగా దేశంలోని అన్ని వక్ఫ్ ఆస్తుల నమోదును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించడానికి సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు ఒక న్యాయవాది శుక్రవారం ఈ మధ్యంతర పిటీషన్‌ను తీసుకొచ్చారు.

పార్లమెంటులోకి వ్యక్తి చొరబాటు

న్యూఢిల్లీ : పార్లమెంటులో మరోసారి భద్రతా వైఫల్యం బట్టబయలైంది. శుక్రవారం ఉదయం 5.50 గంటలకు 20 ఏళ్ల యువకుడు గోడ దూకడానికి ప్రయత్నించగా, భద్రతా సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. న్యూ ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దేవేష్ మహ్లా మీడియాతో మాట్లాడుతూ నిందితుడిని సిఐఎస్‌ఎఫ్, ఢిల్లీ పోలీసు సిబ్బంది పట్టుకున్నారని చెప్పారు. నిందితుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ. అతని మానసిక ఆరోగ్యం సక్రమంగా లేదని భావిస్తున్నామని, ఇంటరాగేషన్, వెరిఫికేషన్ జరుగుతున్నాయని డిసిపి చెప్పారు. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి), ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్‌సహా కేంద్ర ఏజెన్సీలు నిందితుడిని ప్రశ్నిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటి రోజు ఈ ఘటన జరగడం గమనార్హం. 2023 డిసెంబర్‌లో కూడా ఇటువంటి భద్రతా ఉల్లంఘన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే.

'ఉక్కు'పై స్తంభించిన జివిఎంసి కౌన్సిల్

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించారు. తొలగించిన ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని, భవిష్యత్తులో విఆర్‌ఎస్ పేరిట కార్మికులను తొలగించరాదని, 8800 మంది ఆర్ కార్డుదారులకు తక్షణమే శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. ఆ తీర్మానాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పంపాలని కౌన్సిల్‌లో సభ్యులంతా తీర్మానించారు. ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి గవర్నమెంట్‌లో ఒకసారి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వంలో మరోసారి తీర్మానించారు.

ఆధార్‌తో ఆన్‌లైన్‌లో అప్లై చేయండి

- తొలగించబడిన ఓటర్లకు సుప్రీం ఆదేశాలు
- రాజకీయ పార్టీలు సాయం చేయాలని సూచన

న్యూఢిల్లీ : బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేనివారు వాటిని చేర్చాలని కోరుతూ ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులు అందజేయవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. వ్యక్తిగతంగా దరఖాస్తులు అందజేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఆ దరఖాస్తుతోపాటు ఎన్నికల కమిషన్ పేర్కొన్న 11 పత్రాల్లో ఏ ఒక్కదాన్నైనా లేదా ఆధార్ కార్డు కాపీని అందజేయవచ్చని కోర్టు పేర్కొంది. ఈ దరఖాస్తులు పెట్టుకోవడానికి ఓటర్లకు వారి పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ఏజెంట్లు సహాయపడేలా చూడాల్సిందిగా బీహార్‌లో గుర్తింపు పొందిన 12 రాజకీయ పార్టీలను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ ఆదేశించింది. ఈ విషయంలో ఇప్పటికే పిటిషనర్లు కాకపోయినట్లైతే, గుర్తింపు పొందిన ఆ రాజకీయ పార్టీలన్నీ కూడా ప్రతివాదులుగా వుంటాయని కోర్టు పేర్కొంది. రాజకీయ పార్టీలకు 1.6 లక్షల మందికి పైగా పోలింగ్ కేంద్రాల ఏజెంట్లు వున్నప్పటికీ, వారి నుంచి రెండు అభ్యంతరాలు మాత్రమే రావడం పట్ల కోర్టు విస్మయం వ్యక్తం చేసింది. మరోవైపు పోలింగ్ కేంద్రాల ఏజెంట్లు పేర్కొన్న అభ్యంతరాలను అధికారులు గుర్తించడం లేదని కొన్ని పార్టీలు తెలిపాయని కోర్టు పేర్కొంది. ఏజెంట్లు అందజేసే అభ్యంతరాలను పోలింగ్ కేంద్రాల అధికారులు (బిఎల్‌ఒ) అందుకున్నట్లుగా రసీదులు జారీ చేయడం లేదని కొందరు పిటిషనర్లు ఆందోళనలు వ్యక్తం చేశారు.

దానిపై కోర్టు స్పందిస్తూ, భౌతికంగా దరఖాస్తులు అందజేసినప్పుడు రసీదులు ఇవ్వాల్సిందేనని కోర్టు బిఎల్‌ఒలను ఆదేశించింది.

ఇసి తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది మాట్లాడుతూ ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేసేందుకు ఎన్నికల కమిషన్‌కు సహకరించడానికి ముందుకు రావాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలదని, వారు సహకరించడం లేదని అన్నారు. ఈరోజు వరకు ఒక్క రాజకీయ పార్టీ కూడా ఒక్క అభ్యంతరం లేవనెత్తుతూ దరఖాస్తు ఇవ్వలేదని, కోర్టును ఆశ్రయించలేదని చెప్పారు. దానిపై సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ఎఎం సింఘ్వి తీవ్రంగా స్పందించారు. బీహార్‌లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా తరపున తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని కపిల్ సిబల్ చెప్పారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, సిపిఐ, ఎన్‌సిపి తదితర పార్టీలు సంయుక్తంగా దాఖలు చేసిన పిటిషన్‌పై తాను వాదనలు వినిపిస్తున్నానని సింఘ్వి తెలిపారు.

అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, చాలామంది రాష్ట్రానికి వెలుపల వలస కార్మికులుగా పనిచేస్తూ వుంటారని, వారు దరఖాస్తులు అందజేయలేరని అన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ అన్ని పార్టీలకు పోలింగ్ కేంద్రాల స్థాయి ఏజెంట్లు లేరన్నారు. అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన ఆర్‌జెడికి కూడా సగం నియోజకవర్గాల్లోనే ఏజెంట్లు ఉన్నారని తెలిపారు. దానిపై కోర్టు స్పందిస్తూ ఆధార్ కార్డులతో ఆన్‌లైన్‌లో ఏ ఓటరైనా తమ పేర్లు చేర్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

స్వాగతించిన సిపిఎం

బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా అంశంపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడాన్ని సిపిఎం స్వాగతించింది. మిగిలిన సమయం చాలా పరిమితంగా వున్నందున ఓటర్ల జాబితా నుండి 65 లక్షల పేర్లను తొలగించడం వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చలేకపోవచ్చని పేర్కొంది. అయినా ఈ విషయంలో సుప్రీం కోర్టు జోక్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపింది.

కొలంబియాలో హెలికాప్టర్‌పై డ్రోన్‌తో దాడి

- 12 మంది మృతి
- మరోదాడిలో ఆరుగురు బలి

బొగొటా : కొలంబియాలో ఫార్మర్ రివల్యూషనరీ ఆర్మ్‌ ఫోర్సెస్ ఆఫ్ కొలంబియా (ఎఫ్‌ఎఆర్‌సి)కు చెందిన తిరుగుబాటు గ్రూపు రెచ్చిపోయింది. ఈ గ్రూపు చేసిన రెండు వేర్వేరు దాడుల్లో మొత్తం 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 71 మంది గాయపడ్డారు. గురువారం కొన్ని గంటల వ్యవధిలోనే ఈ దాడులు జరిగాయి. గురువారం ముందుగా ఆంటియోక్వియో రాష్ట్రంలో అమాల్ఫీ మున్సిపాలిటీలో నేషనల్ పోలీస్ బ్లాక్ హాక్ హెలికాప్టర్‌ను తిరుగుబాటు గ్రూపు డ్రోన్‌తో కూల్చివేసింది. ఈ ప్రమాదంలో 12 మంది పోలీసు అధికారులు మరణించారు. ఈ తరువాత దేశంలో జనాభాపరంగా మూడో అతిపెద్ద నగరమైన ఖాలిలో పేలుడు పదార్థాలతో నిండిన ఒక కారును తిరుగుబాటు గ్రూపు పేల్చివేసింది. పట్టణంలోని కొలంబియన్ ఏరోస్పేస్ ఫోర్స్ సెంటర్‌కు సమీపంలో ఈ దారుణం జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. మరో 71 మంది తీవ్రంగా గాయపడ్డారు. కొలంబియా అధ్యక్షులు గుస్తావో పెట్రో ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. ఎఫ్‌ఎఆర్‌సి తిరుగుబాటు సభ్యుల నుంచి భారీ ఎత్తున కొకైన్ స్వాధీనం చేసుకున్నందుకే ఈ ప్రతీకార దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. సాయుధ తిరుగుబాటు దారులను, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠాలను ఉగ్రవాదులుగా పరిగణిస్తామని, ప్రపంచంలో ఎక్కడున్నా వెంటాడుతామని హెచ్చరించారు.

'సురవరం' కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

అన్ని పాఠశాలలకు విస్తరించి ఉద్యమంగా మారింది. 1960లో ఎఐఎస్‌ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆతర్వాత కర్నూలు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 1962లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కోసం ఏర్పాటు చేసిన సమ్మెకు కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ కమిటీ 62రోజుల పాటు చేసిన సమ్మెకు నాయకత్వం వహించారు. అనంతరం కర్నూలులోని కళాశాల విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బి చదువుతున్న సమయంలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాల అనంతరం ఎఐఎస్‌ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలను సురవరంకు అప్పగించారు. 1966లో ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి అయ్యారు. దీంతో ఆయన ఢిల్లీకి మకాం మార్చారు. 1969లో రెండోసారి ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. 1970లో ఎఐఎస్‌ఎఫ్ జాతీయాధ్యక్షుడయ్యారు. 1972లో ఎఐవైఎఫ్ జాతీయాధ్యక్షుడయ్యారు. 1971లో కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన సిపిఐ 9వ నేషనల్ కౌన్సిల్ సమావేశాల్లో జాతీయ కమిటీ సభ్యుడయ్యారు. 1974లో తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన సురవరం ఆనాటి నుంచి 1984 వరకు సిపిఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. 1985, 90లో కొల్లాపూర్ అసెంబ్లీ నుంచి సురవరం సుధాకర్ రెడ్డి పోటీ చేసి ఓటమి చవిచూశారు. 1994లో కర్నూలులోని డోన్‌లో ముఖ్యమంత్రి విజయభాస్కర్‌రెడ్డిపై పోటీచేసి ఓడిపోయారు. 1998లో నల్గొండ పార్లమెంట్ నుంచి 12వ లోక్ సభకు ఎన్నికయ్యారు. ఇదే సంవత్సరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2004లో జరిగిన 14వ లోక్‌సభ ఎన్నికల్లో నల్గొండ నుంచే రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సమయంలోనే సురవరం కార్మిక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ అయ్యారు. 2007లో హైదరాబాద్‌లో జరిగిన సిపిఐ జాతీయ మహాసభల్లో ఉప ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2012 పాట్నాలో జరిగిన జాతీయ మహాసభల్లో పార్టీ ప్రధానకార్యదర్శిగా నియమితులయ్యారు. చంద్రరాజేశ్వరరావు తరువాత జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా సురవరం నిలిచారు. 2015 మహాసభల్లోనూ ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. ఆ తరువాత కొల్లంలో మూడోసారి తిరిగి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2012 నుంచి 2019వరకు ఆయన జాతీయ ప్రధానకార్యదర్శిగా పదవిలో కొనసాగారు.

ప్రత్యేక షెల్టర్లలో రేబిస్ వచ్చిన కుక్కలు

- స్టెరిలైజేషన్ తరువాత ఎక్కడి వాటిని అక్కడే విడిచిపెట్టండి : సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : వీధికుక్కలపై గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం సవరించింది. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో ఆరు నుంచి ఎనిమిది వారాల్లోపు వీధి కుక్కలను నిర్బంధించి షెల్టర్లకు తరలించాలని ఈ నెల 11న సుప్రీంకోర్టు సుమోటోగా ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అభ్యంతరాలు వ్యక్తమవడంతో, ఆ తీర్పును సవరిస్తూ.. వీధికుక్కలను స్టెరిలైజేషన్, నులిపురుగుల నిర్మూలన, ఇమ్యునైజేషన్ నిర్వహించిన అనంతరం వాటిని ఎక్కడి నుండి తీసుకువచ్చారో ఆ ప్రాంతాల్లోనే విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. రేబిస్ సోకిన లేదా విపరీతంగా ప్రవర్తించే కుక్కలకు ఈ ఉత్తర్వులు వర్తించవని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. అటువంటి కుక్కలకు స్టెరిలైజేషన్, టీకాలు వేయాలని, ప్రత్యేక షెల్టర్స్‌లో ఉంచాలని ఆదేశించింది. వీధి కుక్కల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని నిర్దిష్ట మున్సిపల్ వార్డులో ఆహారం అందించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని జస్టిస్ విక్రమ్ నాథ్ ఆదేశించారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం ఇవ్వాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఉంచాలని తెలిపారు. వీధుల్లో ఆహారం పెట్టేందుకు అనుమతి లేదని, ఈ ఆదేశాలను ఉల్లంఘించి కుక్కలకు ఆహారం అందిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవలసి ఉంటుందని హెచ్చరించారు.

వీధి కుక్కలకు నియంత్రణ లేకుండా ఆహారం అందించడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకుని ఈ ఆదేశాలు జారీ చేసినట్లు ధర్మాసనం అభిప్రాయపడింది. ఉల్లంఘించిన వారి వివరాలు తెలిపేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులు లేదా ఎన్‌జిఓలపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. జంతు ప్రేమికులు సంబంధిత మున్సిపల్ అధికారుల ద్వారా వీధికుక్కలను దత్తత తీసుకోవచ్చని, వాటిని వీధుల్లోకి కాకుండా చూసుకోవడం వారి బాధ్యత అని స్పష్టం చేసింది.

వ్యవసాయ భూమి పరిరక్షణకు ప్రత్యేక చట్టం

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాలని కోరారు. గ్రామసభకు తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి సైతం వీటిని అతిక్రమించే హక్కు ఉండకూడదని పేర్కొన్నారు. నాలా చట్టం రద్దుపై రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులతో తక్షణమే సమావేశం జరిపి వారి అభిప్రాయాలను తీసుకోవాలని, చట్టం అమల్లో ఉండగానే నగరాలు, పట్టణాల సమీపంలో ఉన్న వేలాది ఎకరాల వ్యవసాయ భూములను వచ్చిలవిడిగా రియల్ ఎస్టేట్‌కు బదిలీ అయిపోతున్నా యని వివరించారు. ఇక్కడ వేస్తున్న వెంచర్ల వల్ల నీరు వెళ్లడానికి సరైన ఏర్పాట్లు ఉండటం లేదని, చిన్నపాటి వర్షాలకే నగరాలు, పట్టణాల్లో అనేక కాలనీలు నీటమునిగి పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బం దులు కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. నాలా చట్టం రద్దు ద్వారా ఇలాంటి ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. తక్షణం ప్రణాళికాబద్ధమైన నగర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ భూములను గ్రామాలను ఇష్టానుసారం పట్టణాల్లో కలపరాదని డిమాండు చేశారు.

ప్రణాళిక ప్రకారమే!

- దోహదపడిన బీరేన్‌సింగ్ ప్రభుత్వ వైఫల్యాలు
- కుప్పకూలిన రాజ్యాంగ వ్యవస్థలు, కేంద్ర సంస్థలు
- మణిపూర్ హింస, అల్లర్లపై పియుసిఎల్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : మణిపూర్‌లో 2023 మే 3న తలెత్తిన హింస, ఘర్షణలు ఆకస్మికంగా, యాదృచ్ఛికంగా జరిగినవి కావని, ఒక ప్రణాళిక ప్రకారం, జాతులను లక్ష్యంగా చేసుకుని సాగించినవని పియుసిఎల్ (పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్) నివేదిక నిర్ధారణకు వచ్చింది. ఇందుకు బీరేన్‌సింగ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ వైఫల్యాలు కూడా దోహదపడ్డాయని తెలిపింది. మణిపూర్‌లో సాగుతున్న జాతుల ఘర్షణలపై ఇండిపెండెంట్ పీపుల్స్ ట్రిబ్యునల్ 694 పేజీల నివేదికను బుధవారం వెలువరించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన ఈ నివేదికను రూపొందించారు.

వేలాదిమంది అభిప్రాయాలను విని...

నివేదిక నిష్పక్షపాతంగా వుండేందుకు గానూ మణిపూర్‌కు వెలుపల గల ప్రముఖులైన న్యాయ నిపుణులను ఎంచుకుని గతేడాది పియుసిఎల్, ఇండిపెండెంట్ పీపుల్స్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఈ ట్రిబ్యునల్ ఎదుట 150 మందికి పైగా బాధితులు మౌఖికంగా సాక్ష్యమిచ్చారు. వేలాదిమంది రాతపూర్వకంగా తమ అనుభవాలు, అభిప్రాయాలు తెలియజేశారు. పలుమార్లు గ్రూపు డిస్కషన్లు జరిగాయి. "వారందరి గొంతుకలు విన్నాం." అని జ్యూరీ ఆ నివేదికలో పేర్కొంది. హింస, ఘర్షణలు జరిగి 27మాసాలైన తర్వాత కూడా అంతర్గతంగా నిర్వాసితులై ప్రస్తుతం శిబిరాల్లో తల దాచుకుని, కనుచూపు మేరలో పరిష్కారాలు కానరాక ఇబ్బందులు పడుతున్న 60వేలమందికి పైగా ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.

హింసకు బీజం వేసిన కారణాలు

దీర్ఘకాలంగా నెలకొని వున్న జాతుల మధ్య విభేదాలను, సామాజిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని, భూ వివాదాలను నివేదిక గుర్తించింది. ఇవే హింసకు బీజం వేశాయని పేర్కొంది. వ్యవస్థాగతంగా సాగే విద్వేష ప్రచారాలు, రాజకీయ వాగాడంబరాలతో ఇవన్నీ మరింత పెచ్చరిల్లాయని తెలిపింది. దాంతో మెయితీ, కుకీ–జో కమ్యూనిటీల మధ్య అపనమ్మకం, విద్వేషం పెరుగుతూ వచ్చాయని నివేదిక అభిప్రాయపడింది.

మెయితీలకు ఎస్‌టి హోదాను సిఫార్సు చేస్తూ మణిపూర్ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు 2023 మార్చి



మణిపూర్‌లో అల్లర్లు (ఫైల్)

27న ప్రధానమైన వివాదం రేకెత్తడానికి కారణమయ్యాయి. ఈ ఆదేశాలు గిరిజన గ్రూపుల్లో ముఖ్యంగా కుకీలు, నాగాల్లో భయాందోళనలు రేకెత్తించాయి. తమ రాజ్యాంగబద్ధమైన రక్షణలు తుడిచిపెట్టుకుపోతాయని వారు భయపడ్డారని నివేదిక పేర్కొంది. కోర్టు తీర్పు ఒక ఉత్ప్రేరకంగా పనిచేసిందని నివేదిక వ్యాఖ్యానించింది. దీంతో మే 3న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. ఆ నిరసనలు అత్యంత త్వరగా లక్షిత హింసాకాండకు దారి తీశాయని నివేదిక పేర్కొంది.

కుకీలు మయన్మార్ నుండి వచ్చిన అక్రమ వలసదారులని, వారు గంజాయి సాగు చేస్తున్నారనే అబద్ధపు ప్రచారాన్ని ఈ నివేదిక పటాపంచలు చేసింది. ఆ రెండు వాదనలు కూడా అతిశయోక్తితో చేసినవేనని, రాజకీయంగా ఆయుధాలుగా వాడేందుకు ఉపయోగించేవే అని నివేదిక స్పష్టం చేసింది. కుకీల కమ్యూనిటీని దెబ్బతీయడానికే ఇవి ఉపయోగపడ్డాయని తెలిపింది.

పాశవికత, ఉదాసీనత

బాధితులు ఇచ్చిన సాక్ష్యాధారాలు మరికొన్ని భయం గొలిపే వాస్తవాలను వెల్లడించాయి. "హత్యలను, శరీర భాగాలను నరికివేయడం, మహిళలను వివస్త్రలుగా చేయడం, లైంగిక హింస, వేధింపులు, అవమానాలు పెద్ద ఎత్తున చూశాం" అని అనేకమంది మహిళలు సాక్ష్యమిచ్చారు. తమకు సాయంచేయడంలో పోలీసులు ప్రతీసారీ విఫలమయ్యారని వారు విమర్శించారు. కొన్నిసార్లయితే తమను వారే అల్లరి మూకలకు అప్పగించిన సందర్భాలు కూడా వున్నాయని వారు వాపోయారు.

విద్వేష ప్రచారానిదే కీలక పాత్ర

విద్వేష ప్రచారమనేది కీలకపాత్ర పోషించింది. రెచ్చగొట్టే సమాచారంతో సోషల్ మీడియా నిండిపోయింది. పక్షపాతంతో కూడిన ప్రింట్ మీడియా ఇచ్చిన వార్తా కథనాలతో విభజనలు మరింత పెచ్చరిల్లాయని నివేదిక తెలిపింది. హింస జరుగుతోందని తెలిసినా ప్రభుత్వం దాన్ని ఆపడానికి ఏమీ చేయలేదని ఒక మహిళ జ్యూరీకి తెలిపింది.

సహాయక చర్యలేవీ?

ఇక ప్రభుత్వం వైపు నుండి సహాయక చర్యలు కుప్పకూలడంతో బాధితుల ఇబ్బందులు, కష్టాలు మరింత పెరిగాయి. "శిబిరాల్లో మౌలిక పారిశుధ్యం లోపించింది. ఆహారం, వైద్య సదుపాయాలు లేవు. ఆస్పత్రులపై కూడా దాడులు జరిగాయి. దాంతో సిబ్బంది పారిపోయారు. రోగులకు కుల, మత ప్రాతిపదికన చికిత్సలు నిరాకరించేవారు" అని నివేదిక పేర్కొంది. బాధితుల్లో మానసిక రుగ్మతలు కూడా తలెత్తాయని పేర్కొంది.

కుప్పకూలిన రాజ్యాంగ వ్యవస్థలు

శాంతి భద్రతల యంత్రాంగంపై నివేదిక ఇచ్చిన నిర్ధారణలు చాలా తీవ్రంగా వున్నాయి. ఎంపిక చేసిన వారిపైనే ఎఫ్ఐఆర్‌లు పెట్టారు. దర్యాప్తుల్లో అసాధారణమైన జాప్యాలు, భద్రతా బలగాలు ఉదాసీనంగా వ్యవహరించాయని నివేదిక పేర్కొంది. నిష్పాక్షిక ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నివేదిక విమర్శించింది.

సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నా సరిపోలేదు. గీతా మిట్టల్ కమిటీ, సిబిఐ పరిమిత దర్యాప్తులతో పెద్దగా ఉపయోగంలేదు. పేలవమైన వనరులు, తదనంతర కార్యాచరణ లోపించడం ప్రధానంగా కనిపిస్తోందని నివేదిక పేర్కొంది. జాతుల మధ్య విభేదాలను మరింత తీవ్రతరం చేసేలా వ్యవహరించాయంటూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అభిశంసనలు ఎదురయ్యాయి.

న్యాయం, శాంతికి సిఫార్సులు

మణిపూర్ ప్రజల్లో జవాబుదారీతనాన్ని, విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించాల్సి వుందని నివేదిక పేర్కొంది. కొండ ప్రాంత జిల్లాల్లో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయాలని, వేలాదిగా పెండింగ్‌లో వున్న కేసుల పరిష్కారానికి స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించాలని సిఫార్సు చేసింది. హింసకు ఆజ్యం పోస్తున్న విద్వేష ప్రచారాన్ని, ప్రసంగాలను కఠినంగా ప్రాసిక్యూట్ చేయాలని కోరింది. ఉపశమన, సహాయక చర్యలను బలోపేతం చేయాలని సూచించింది. కమ్యూనిటీల మధ్య చర్చలను కొనసాగించాలని, అప్పుడే పెరుగుతున్న విభజనలు, విభేదాలు సమసిపోవడానికి అవకాశం వుంటుందని పేర్కొంది. వ్యవస్థాగత స్పందన రాకుండా శాంతిని పునరుద్ధరించలేమని చివరగా నివేదిక వ్యాఖ్యానించింది. మణిపూర్ ప్రజలు ఈ అరకొర చర్యల కన్నా మించి అర్హులని ప్రకటించింది.

జీవన సౌరభం


ప్రపంచం మారాలని కోరుకోవడం కాదు, ఆ మార్పు మనతోనే మొదలవ్వాలి.

మీ కోసం

వేలు తెగిన చోట వెల్లుల్లి రసాన్ని రాస్తే బాక్టీరియా చేరకుండా ఉంటుంది.



మంచి మార్గం



రామయ్య చాలా మంచివాడు. వ్యవసాయం అతని వృత్తి. ఒకరోజు రామయ్య పొలం పనులు చేసుకుంటూ ఉండగా పొలంలో ఒక మూసి ఉన్న ఇత్తడి బిందె దొరికింది. అది చాలా బరువుగా ఉంది. అందులో పాత కాలం నాటి నిధులు ఉన్నాయని రామయ్య గ్రహించాడు. దాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తే 'ఆ సొమ్ము పేదలకు ఉపయోగపడుతుంది' అని భావించాడు. అయితే 'నువ్వు కొంత ఉంచుకుని మిగిలింది కూడా నువ్వే పేదలకు పంచమ'న్నారు కుటుంబ సభ్యులు. అది సరైన పద్ధతి కాదని, ఆ నిధిని ప్రభుత్వం వారికి అప్పగిస్తానని రామయ్య నిక్కచ్చిగా చెప్పాడు.


దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆ వస్తువులని ఇచ్చాడు. రామయ్య చేసిన పనికి అధికారులు అతన్ని ఎంతో మెచ్చుకున్నారు. అయితే ఇంటికి తిరిగి వచ్చిన రామయ్యని కుటుంబం సభ్యులు, ఇరుగుపొరుగు వారు ఎత్తిపొడవడం మొదలుపెట్టారు. అనవసరంగా డబ్బుని వృధా చేశాడని సూటిపోటి మాటలు అన్నారు. రామయ్య ఇవేమీ పట్టించుకోలేదు.


కొద్దిరోజుల తర్వాత గ్రామంలోకి కొన్ని అధికారిక వాహనాల శ్రేణి వచ్చింది. రామయ్యను తమతో పాటు రావాల్సిందిగా అధికారులు కోరారు. రామయ్య ఒప్పుకోగా, అతన్ని పట్టణంలో ఒక పెద్ద సభకి తీసుకెళ్లారు. అక్కడ మంత్రులందరూ రామయ్య చేసిన పని గురించి చెప్పి పొగిడారు. రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలని అందరికీ చెప్పారు. ఈ విషయం గ్రామంలో తెలిసి రామయ్యని గౌరవించడం ప్రారంభించారు. తాము కూడా అతని బాటలో నడుస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తుల్లో వచ్చిన మార్పు చూసి రామయ్య ఎంతో సంతోషించాడు.

- ఎస్.సునీల్ కుమార్,
తిరుపతి, 83285 32902.

తేడాలు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మల్లో ఐదు తేడాలున్నాయి. కనిపెట్టండి చూద్దాం.






నేను గీసిన బొమ్మ




డి. నందిని
5వ తరగతి,
ఎంపియుపి స్కూలు,
పి.నైనవరం, ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మకు ప్రేమతో ...

అమ్మ తన అపూర్వమైన ప్రేమతో ఆ చిన్నారికి రెండో జన్మనిచ్చింది. ఆ బాలుడు ఆటల్లో అపూర్వ విజయాలు సాధిస్తూ, అమ్మకు ప్రేమతో బంగారు పతకాలు అందిస్తున్నాడు. ఈ గాధ అమ్మ ప్రేమకు శిఖరం లాంటి ఉదాహరణ. అవయవదానం ప్రాధాన్యాన్ని చాటి చెప్పే ఓ వైజ్ఞానిక పాఠం!



జర్మనీలో జరుగుతున్న 'వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడ'ల్లో 50కి పైగా దేశాల నుంచి పాల్గొంటున్న క్రీడాకారుల కథలు అవయవదానం వాళ్లని విజేతలుగా ఎలా నిలబెట్టిందో కళ్లకు కడుతున్నాయి. అందులో భారత్‌కి చెందిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. కిడ్నీ ఫెయిల్ అయిన కొడుక్కి తన కిడ్నీ దానమిచ్చి రెండో జన్మ ఇచ్చిన కర్నాటకకి చెందిన తల్లి కథ ఎంతోమందికి అవయవదానం పట్ల మరింత అవగాహనని పెంచుతుంది.

వరుణ్ ఆనంద్ (15) ఈ క్రీడల్లో వివిధ విభాగాల్లో ప్రావీణ్యం చూపిస్తున్నాడు. వరుణ్ తల్లి దీప, కొడుకు గెలుపుని ఆస్వాదిస్తూనే అనారోగ్యంతో అతను పడిన ప్రతి క్షణాన్ని తలచుకుని కన్నీరు కారుస్తోంది. అక్కడ ఆట ఆడుతున్న ప్రతి క్రీడాకారుల తల్లిదండ్రులు, తోడబుట్టిన వారందరి పరిస్థితి ఇదే. దీప తన అనుభవాన్ని ఇలా చెబుతోంది.

'ఆనంద్‌కి చిన్నతనం నుండీ ఆటలంటే చాలా ఇష్టం. అయితే 9 ఏళ్లు వచ్చేసరికి వాడు బాగా నీరసించిపోయాడు. బయట ఎక్కువసేపు ఆడుకోలేక అలసటగా ఉంది అని చెప్పేవాడు. రోజురోజుకూ వాడి పనులు వాడు చేసుకోవడమే కష్టంగా భావించాడు. మొదట్లో మేము ఆటలు ఆడి అలిసిపోతున్నాడు అనుకునేవాళ్లం. తరచూ జ్వరం రావడం, కాళ్లు ఉబ్బడం జరగడంతో– ఆస్పత్రిలో చేర్పించాం. పరీక్షలు చేశాక వాడి కిడ్నీ పూర్తిగా చెడిపోయిందని తేలింది. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ తప్ప వేరే మార్గం లేదని కూడా డాక్టర్లు అన్నారు. 9 ఏళ్ల నా చిన్ని తండ్రికి ఎంత కష్టమొచ్చిందో అని తల్లడిల్లిపోయాను. ట్రాన్స్‌ప్లాంట్‌కి నా కిడ్నీ సరిపోతుందని తెలిసి ఎంత సంతోషించానో చెప్పలేను. అలా నా బిడ్డకి మళ్లీ కొత్త జీవితం జీవించేలా చేశాను' అని దీప ఆ రోజులను గుర్తు చేసుకున్నారు.

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ తరువాత వరుణ్ నిదానంగా కోలుకున్నాడు. అనారోగ్యంతో ఎముకలు వంగిపోయి, ఎప్పుడూ అలసటగా ఉంటూ కొన్నేళ్లపాటు ఇంటికే పరిమితమైన వరుణ్, మైదానానికి వెళ్లి ఆటలాడేంత శక్తిని కూడదీసుకున్నాడు. 2023లో పెర్త్‌లో జరిగిన వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడల్లో పాల్గొని టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, టెన్నిస్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. ఈ విజయాలపై వరుణ్ ఇలా అంటున్నాడు.

'నాకు ఇంత శక్తి ఉందని తెలియదు. ఈ జీవితం అమ్మ నాకు ప్రసాదించిన రెండో జీవితం. క్రీడల్లో నేను గెలిచిన ప్రతి పతకం అమ్మకే అంకితం' అని ఒకింత భావోద్వేగంగా చెప్పాడు.

1978 నుండి ప్రారంభమైన ఈ క్రీడలు ఈ ఏడాది జర్మనీలో 25వ ఎడిషన్‌ని జరుపుకుంటున్నాయి. ఆగస్టు 17 నుండి 24 వరకు జరిగే ఈ క్రీడల్లో ట్రాన్స్‌ప్లాంట్ చేసుకుని ఆరోగ్యవంతమైన జీవితాలు గడుపుతున్న, క్రీడల్లో ప్రవేశమున్న ప్రతి ఒక్కరికీ అవకాశం ఇస్తారు. పాల్గొనేవారికి 4 ఏళ్ల నుండి వయోపరిమితి విధించారు. ట్రాన్స్‌ప్లాంట్ జరిగి ఏడాది సమయం పూర్తయి ఉండాలి. ఈ సంవత్సరం 17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

భారత్ నుండి ప్రవేశం పొందిన క్రీడాకారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అనికా పరాషర్ ఈ పోటీలను మొదటి వరుసలో కూర్చొని ఆస్వాదిస్తున్నారు. 2023 బ్యాచ్‌కి కూడా అనికానే ప్రాతినిధ్యం వహించారు. ఢిల్లీకి చెందిన 'ఆర్గాన్ ఇండియా' సంస్థని ఆమె నిర్వహిస్తున్నారు. గుండె మార్పిడి చేయించుకున్న తన తల్లి స్ఫూర్తితో అనిక ఈ సంస్థని నడిపిస్తున్నారు. భారత్ వ్యాప్తంగా అవయవదానంపై అవగాహన కల్పించడం, జీవితాలు మళ్లీ ప్రారంభించిన వారికి అవకాశాలు ఇవ్వడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తుంది. తన ప్రయాణపు అనుభవాలను అనిక ఇలా చెబుతున్నారు. 'భారత్‌లో పెద్ద ఆరోగ్య సంరక్షణ సంస్థ ఉంది. అయినా మేము ఇప్పటికీ అవయవదానం గురించిన సరైన సమాచారం సేకరించడానికి చాలా కష్టపడుతున్నాం. అవయవదానంపై చాలామందికి అపోహలు, అనుమానాలు ఉన్నాయి. వాటిని నివృత్తిచేసేలా మేం పనిచేస్తున్నాం' అని చెబుతున్న అనిక, వరుణ్ గురించి కూడా మాట్లాడారు.

'2023లో తీసుకెళ్లిన బ్యాచ్‌లో ఉన్న 32 మంది క్రీడాకారుల్లో వరుణ్ ఒక్కడే చిన్న పిల్లవాడు. 12 ఏళ్ల వరుణ్ అక్కడ ఎంతో ప్రతిభ చూపించాడు. అప్పుడే అక్కడ తమ పిల్లలకు అవయవాలు దానం చేసిన ఎంతోమంది తల్లిదండ్రులను నేను చూశాను. ఆ పిల్లలను కలుసుకున్నాను. జట్టులో ఒకరికొకరు అవయవాలను దానం చేసిన తోబుట్టువులు ఉన్నారు. వీళ్ల ప్రయాణం ఎంతో స్ఫూర్తివంతమైనది' అంటున్నారు అనిక.

2023లో బంగారు పతకాలు సాధించిన వరుణ్, మొదటి పతకం గెలిచినప్పటి అనుభవాన్ని ఇలా చెప్పాడు. 'అమ్మానాన్న నన్ను ఎంతో ప్రోత్సహించారు. ఆడుకోమని చెప్పేవారు. గెలవడానికి ప్రయత్నించమని అనేవారు. కానీ నా మొదటి బంగారు పతకం సాధించేవరకు, నన్ను నేను నమ్మలేదు. అప్పుడు మాత్రమే నేను ఏం సాధించానో చూసి ఆశ్చర్యపోయాను. పోడియంలో కూర్చొన్న అమ్మ వెక్కివెక్కి ఏడ్వడం నాకు ఇప్పటికీ గుర్తే. అమ్మ ఇచ్చిన కిడ్నీ నన్ను ఇక్కడివరకు తీసుకొచ్చింది. దేశం తరపున ఆడి పతకం సాధించేలా నాకు కొత్త జీవితాన్ని ఇచ్చింది' అంటున్న వరుణ్ 'అవయవదానం పాత పుస్తకాన్ని మూసివేసి కొత్త పుస్తకం రాయడానికి సాయం చేసింది' అని ముగించాడు.




ప్రస్తుతం జర్మనీలో జరుగుతున్న పోటీల్లో పతకాలు సాధించిన మనదేశ క్రీడాకారులు

వెబ్‌సైట్‌లో రిజిస్టర్ ఇలా..



అవయవదానం గురించి అనికా ఇలా వివరించారు ..: 'భారతదేశంలో, అవయవ మార్పిడి విషయంలో చాలా అపోహలు ఉన్నాయి. మేము ఎన్‌ఒటిటిఒ (నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో పనిచేస్తాం. మాతో నమోదు చేసుకున్న ఎవరి డేటా అయినా ప్రభుత్వ వ్యవస్థకు వెళుతుంది. మా సంస్థ ప్రతి క్లైంటుకి జవాబుదారీగా ఉంటుంది. ఆసక్తి గల దాతలు 'ఆర్గాన్ ఇండియా' వెబ్‌సైట్‌లోకి వెళ్లి అవయవాలను దానం చేయాలనే ఉద్దేశాన్ని తెలియజేయొచ్చు. అవయవ దాతగా నమోదు చేసుకున్న తర్వాత, కుటుంబ సభ్యులకు ఆ విషయాన్ని చెప్పాలి. దాతగా మారడం వల్ల వరుణ్ లాంటి ఎంతోమందికి కొత్త జీవితాన్ని ఇవ్వటం సాధ్యమవుతుంది.


అందరికీ వేతనాలు పెరుగుతాయి



సినీ కార్మికులందరికీ వేతనాల పెంపు ఒప్పందం వర్తిస్తుందని, కొత్త కసరత్తు తరువాత మరింత స్పష్టత వస్తుందని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కులిమిల్లి, కోధికారి టి.వి.అలెగ్జాండర్ (అలెక్స్), తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కన్వీనర్ (తెలంగాణా, ఆంధ్రప్రదేశ్) కన్వీనర్ వెల్లంకి శ్రీనివాస కుమార్ తెలిపారు. శుక్రవారం వారు కార్మికులకు ఒప్పందం గురించి వివరించారు. ఆ వివరాలు ...:

'30 శాతం వేతనాల పెంపుదల కోసం 19 రోజులుగా తెలుగు సినీ కార్మికులు చేపట్టిన ఆందోళన ఫలించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో తెలంగాణా ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ సహకారంతో లేబర్ అసిస్టెంట్ కమిషనర్ గంగాధర్, ప్రభుత్వ పెద్దలు వేమి నరేంద్రరెడ్డి తదితరులు గురువారం నాడు మాతోనూ, నిర్మాతలతోనూ పలు దఫాలుగా చర్చలు జరిపారు. 30 శాతం మనం వేతన అగ్రిమెంట్‌కోసం పోరాటం చేయగా ప్రభుత్వ ఆదేశాలతో 22.5 శాతం పెంపుదలకు నిర్మాతలు అంగీకరించారు. స్కిల్ వర్కర్లను బయట నుంచి తెచ్చుకుంటామన్నారు. 'ఇక్కడ స్కిల్ ఉన్న వారితో చేయించండి. ఇక్కడ లేకపోతే మాత్రమే బయట వారిని తెచ్చుకోవాల'ని కోరగా అంగీకరించారు. ఒక్కో సినిమాకు ఏ విభాగానికి ఎంతమంది ఉండాలనే విషయమై ఒక అంగీకారం కుదరలేదు. దీనిపై నెలరోజుల్లో హైపెక్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని లేబర్ కమిషన్ చెప్పారు. ఈ సమావేశానికి గంగాధర్, దిల్‌రాజు, దానశేఖర్, భరత్ భూషణ్, దామోదర ప్రసాద్ వంటి వారు కూడా హాజరవుతారని తెలపగా ఒప్పుకున్నాం. సెలవు రోజుల్లో డబుల్ కాల్షీట్లు ఇవ్వాలని కోరగా, వారు పెద్ద సినిమాలకు మాత్రమే నెలలోని అన్ని ఆదివారాలకు రోజున్నర కాల్షీట్ ఇస్తామని చెప్పారు. చిన్న సినిమాలకు 2, 4 సండేలకు మాత్రమే రోజున్నర కాల్షీట్ ఇస్తామన్నారు. చిన్న సినిమా విషయమై ఇంకా స్పష్టత రాలేదు. కమిటీలో ఈ విషయమై స్పష్టత వస్తుంది. కాల్షీట్ల విషయమై మేము చాలా గట్టిగానే నిలబడ్డాం. కానీ నిర్మాతలు 9 నుంచి 9 కాల్షీట్లు ఇవ్వాల్సిందే అని పట్టుపడ్డారు. 6 నుంచి 6 కాల్షీట్‌లో రూ.1000 వస్తే రోజున్నరకు రూ.1500 వస్తుంది. మారిస్తే రూ.1600 వస్తుంది. అంటే రూ.100 మాత్రమే పెరుగుదల ఉంటుంది. మేకప్‌మెన్లు, కాస్ట్యూమ్స్ వర్కర్స్, డ్రైవర్లు విషయంపై స్పష్టత రావాల్సివుంది. రోజూవారీ వర్కర్లలైన వీరికి 30 శాతం పెంపుదల వర్తిస్తుంది. 24 క్రాఫ్ట్‌ల్లో రోజువారీ వేతనాలకు సంబంధించిన 13కుగాను 10 యూనియన్ల పరిధిలో వేతనాల ప్రక్రియ ఖరారైంది. రూ.2 వేలలోపు వేతనాలు ఉన్న వారికి తొలి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 2.5 శాతం, మూడో ఏడాది 5 శాతం, రూ.2 వేల నుంచి రూ.5 వేలు ఉన్నవారికి తొలి ఏడాది 7.5 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం పెరుగుతుంది. ఆగస్టు 20 నుంచే ఈ పెంపుదల వర్తిస్తుంది. ఇంకా మహిళా వర్కర్లు, ప్రొడక్షన్ అసిస్టెంట్లు, స్టూడియో వర్కర్లు, లైట్‌మెన్ల అంశంపై స్పష్టత రాలేదు. త్వరలో ఏర్పాటుచేయబోయే కమిటీ సమావేశాల్లో ఈ విషయమై ఆయా యూనియన్ల ప్రతినిధులతో వేర్వేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించుకుందామని గంగాధర్ చెప్పారు. ప్రస్తుతానికి ఫైటర్లు, డ్యాన్సర్లు, టెక్నీషియన్స్‌కు మొదటి ఏడాది 7.5, రెండో ఏడాది 5, మూడో ఏడాది 5 చొప్పున 17.5 శాతం వేతనాల పెంపునకు ఒప్పుకున్నారు. నెలరోజుల్లో జరగబోయే హైపెక్ సమావేశంలో న్యాయబద్ధమైన వేతన సవరణలు ఉంటాయని భావిస్తున్నాం. అందరికీ న్యాయం జరుగుతుంది. మేము మీ పక్షాన ఉన్నాం. త్వరలో జరగబోయే జనరల్ బాడీ సమావేశాల్లో అన్ని విషయాలను చర్చించుకుందాం. వేతన అగ్రిమెంట్ షీట్ రెండ్రోజుల్లో వస్తుంది. అప్పుడు స్పష్టత వస్తుంది. గమనించాల్సిందిగా కోరుతున్నాం' తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కులిమిల్లి, కోశాధికారి టి.వి.అలెగ్జాండర్ (అలెక్స్), తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కన్వీనర్ (తెలంగాణా, ఆంధ్రప్రదేశ్) కన్వీనర్ వెల్లంకి శ్రీనివాస కుమార్ వెల్లడించారు.

సంక్రాంతికి '.. శంకర వరప్రసాద్'



చిరంజీవి హీరోగా, అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రానికి 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్ ఖరారు చేశారు. శుక్రవారం చిరంజీవి పుట్టినరోజు పురస్కరించుకుని టైటిల్‌ను, ఫస్ట్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'చిన్నప్పటి నుంచి చిరంజీవి సినిమాలు చూస్తూ పెరిగాను. నాకు ఆయన నటించిన రౌడీ అల్లుడు, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు సినిమాలంటే చాలా ఇష్టం. మీరందరూ చిరంజీవిని ఎలా చూడాలనుకుంటున్నారో దానికి రెండింతలు ఈ సినిమాలో చూస్తారు. ఈ గ్లింప్స్‌తో సినిమా ఎలా ఉండబోతోందో హింట్ ఇచ్చాను. ఆయన పాట, ఆట, మ్యానరిజమ్స్, ఫైట్స్, లుక్స్‌ను అభిమానించని వారు, ఇమిటేట్ చేయనివారూ ఉండరు. ఇందులో ఆయన కనిపించిన లుక్ ఒరిజినల్. వీఎఫ్ఎక్స్ చాలా తక్కువ వాడాం. ఇందులో 5 శాతం వీఎఫ్ఎక్స్ కూడా లేవు. ఈ లుక్ కోసం ఎంతో కష్టపడ్డారు. టైటిల్ గ్లింప్స్ వీడియోకు వాయిస్ ఓవర్ ఇచ్చినందుకు వెంకటేశ్‌కు థాంక్స్. ప్రస్తుతానికి ఆయన వాయిస్ మాత్రమే విన్నారు. త్వరలోనే ఆయన సినిమాలో ఎంట్రీ ఇవ్వనున్నారు. చిరంజీవి – వెంకటేశ్ కాంబో ఎలా ఉంటుందో ఈసారి సంక్రాంతికి సర్‌ప్రైజ్‌తో చూస్తారు. ఒక్కొక్కటిగా ఆ సర్‌ప్రైజ్‌లను రివీల్ చేస్తాం. కచ్చితంగా ఈ సినిమా మీ అంచనాలను అందుకుంటుంది' అన్నారు. నయనతార కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. భీమ్స్ సంగీతం అందిస్తున్నారు.



మైక్రో డ్రామాలకి రూ.100 కోట్లు!

మంచు సినీ ఇండస్ట్రీలో కొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేసేందుకు మంచు విష్ణు ముందుకువచ్చారు. మైక్రో డ్రామాలపై వంద కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆయన నిర్ణయించుకున్నారు. మూడు నుంచి ఏడు నిమిషాల వ్యవధితో సాగే ఎపిసోడ్స్‌ని మైక్రో డ్రామాలు అని అంటారు. సాధారణ రీల్స్ మాదిరిగా కాకుండా, పూర్తి స్థాయి నిర్మాణం, ప్రొఫెషనల్ డైరెక్షన్, ఎఫెక్టివ్ స్టోరీ, నెరేషన్‌తో ఈ మైక్రో డ్రామాల్ని రూపొందించనున్నారని సమాచారం.

ఫైనల్‌కు తుంగభద్ర వారియర్స్

- క్వాలిఫయర్-2లో ఓడిన భీమవరం బుల్స్
- నేడు టైటిల్ పోరు



విశాఖపట్నం: విసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరిగిన క్వాలిఫయర్-2లో తుంగభద్ర వారియర్స్‌జట్టు ఐదు వికెట్ల తేడాతో భీమవరం బుల్స్‌ను చిత్తుచేసింది. దీంతో తుంగభద్ర వారియర్స్ శనివారం జరిగే టైటిల్ పోరుకు సిద్ధమైంది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2లో తుంగభద్ర వారియర్స్ బ్యాటర్ గుత్తా రోహిత్(87; 40బంతుల్లో 3ఫోర్లు, 9సిక్సర్లు) విధ్వంస ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దీంతో భీమవరం బుల్స్ నిర్దేశించిన 184పరుగుల లక్ష్యాన్ని తుంగభద్ర జట్టు19 ఓవర్లలోనే సునాయాసంగా ఛేదించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భీమవరం బుల్స్‌కు శుభారంభం లభించింది. హిమాకర్(23), రేవంత్‌రెడ్డి(19) తొలి వికెట్‌కు 42పరుగులు జతచేశారు. ఆ తర్వాత భీమవరం జట్టు వరుసగా వికెట్లు కోల్పోయినా.. తోట శ్రావణ్(71నాటౌట్; 40బంతుల్లో 3ఫోర్లు, 6సిక్సర్లు), మువ్వల యువాన్(41; 31బంతుల్లో 5ఫోర్లు, సిక్సర్) ఆదుకున్నారు. వీరిద్దరు కలిసి 4వ వికెట్‌కు 90పరుగులు జతచేశారు. దీంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 5వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసింది. తుంగభద్ర బౌలర్లు ఎం. దీపక్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. అనంతరం తుంగభద్ర ఓపెనర్లు చంద్ర కేశవ(7), జ్ఞానేశ్వర్(0) నిరాశపరిచినా.. రోహిత్(87), ప్రశాంత్ కుమార్(64నాటౌట్; 41బంతుల్లో 4ఫోర్లు, 4సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసారు. చివర్లో డి. రెడ్డి(14) కూడా రాణించడంతో ఆ జట్టు 19 ఓవర్లలో 188 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. భీమవరం బుల్స్ బౌలర్లు హరిశంకర్, సత్యనారాయణ రాజుకు రెండేసి, భువనేశ్వర్ రావుకు ఒక వికెట్ దక్కాయి. నేడు అమరావతి రాయల్స్, తుంగభద్ర వారియర్స్ జట్ల మధ్య టైటిల్ పోరు జరగనుంది.

ఆతిథ్య దేశాల మధ్య తొలి పోరు

- సెప్టెంబర్ 30న భారత్ × శ్రీలంక ఢీ
- నవీ ముంబయికి తరలిన బెంగళూరు మ్యాచ్‌లు
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ కొత్త షెడ్యూల్ విడుదల



ముంబయి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌కు భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ క్రమంలో బెంగళూరులో జరిగే మ్యాచ్‌లను నవీ ముంబయికి మార్చడంతో కొత్త షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) శుక్రవారం విడుదల చేసింది. నవీ ముంబయిలో ఉన్న డివై పాటిల్ స్టేడియంలో మొత్తం ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో మూడు లీగ్ మ్యాచ్‌లు, ఒక సెమీఫైనల్, నవంబర్ 2న జరిగే ఫైనల్ మ్యాచ్ కూడా ఉంది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2వరకు జరిగే టోర్నీ తేదీల్లో మార్పు లేదు. కానీ వేదికలు, మ్యాచ్‌ల తేదీలు మారాయి. గౌహతిలోని ఎసిఎ స్టేడియం, ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం, విశాఖపట్టణంలోని విడిసిఎ స్టేడియం, కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో మహిళల వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

టీమిండియా మహిళలు ఆడే మ్యాచ్‌ల షెడ్యూల్, వేదిక..

సెప్టెంబర్ 30(మంగళ) : ఇండియా × శ్రీలంక	గౌహతి
అక్టోబర్ 5(ఆది) : ఇండియా × పాకిస్తాన్	కొలంబో
9(గురు) : ఇండియా × దక్షిణాఫ్రికా	విశాఖపట్నం
12(ఆది) : ఇండియా × ఆస్ట్రేలియా	విశాఖపట్నం
19(ఆది) : ఇండియా × ఇంగ్లండ్	ఇండోర్
23(గురు) : ఇండియా × న్యూజిలాండ్	నవీ ముంబయి
26(ఆది) : ఇండియా × బంగ్లాదేశ్	నవీ ముంబయి
29(బుధ) : తొలి సెమీఫైనల్	గౌహతి/కొలంబో
30(గురు) : రెండో సెమీఫైనల్	నవీ ముంబయి
02(ఆది) : ఫైనల్	నవీ ముంబయి

ఇలవేనిల్‌కు స్వర్ణం

- ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్



షైమ్‌కెంట్(కజకిస్తాన్): 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు పతకాలు కొల్లగొడుతున్నారు. తాజాగా మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో తమిళనాడుకు చెందిన ఇలవేనిల్ వలరివన్ స్వర్ణ పతకాన్ని సాధించింది. శుక్రవారం జరిగిన పతక పోటీలో ఇలవేనిల్ 0.6పాయింట్ల తేడాతో పెంగ్ షిన్లు(కొరియా)పై సంచలన విజయం సాధించింది. ఆసియా క్రీడల్లో ఇలవేనిల్‌కు పతకం లభించడం ఇది రెండోసారి. వ్యక్తిగత విభాగంలో 26ఏళ్ల ఇలవేనిల్ 2019లో తొలి బంగారు పతకాన్ని సాధించింది. రెండుసార్లు ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించిన మాజీ నంబర్‌వన్ షూటర్ ఇలవేనిల్ రెండుసార్లు వ్యక్తిగత విభాగాల్లోనే బంగారు పతకాలను కైవసం చేసుకోవడం విశేషం. ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత మెహూలీ ఘోస్ నాల్గో స్థానంలో నిలిచింది. టీం విభాగంలో భారతజట్టుకు కాంస్య పతకం లభించగా.. చైనా, కొరియాలకు స్వర్ణ, రజత పతకాలు దక్కాయి. మిక్స్‌డ్ స్కీట్ విభాగంలో గానేమత్ సెకోన్-అభయ్ సింగ్ జంట రెండు కాంస్య పతకాలు సాధించారు. వీరు పతక పోటీలో కువైట్‌పై 39-37పాయింట్ల తేడాతో విజయం సాధించారు. జూనియర్ మిక్స్‌డ్ స్కీట్ స్వర్ణం భారత్‌కు చెందిన యశస్వి రాథోరే-హర్‌మెహర్ సింగ్ కైవసం చేసుకున్నారు. వీరు స్వర్ణ పతక పోటీలో 39-36పాయింట్ల తేడాతో కజకిస్తాన్ జంటను చిత్తుచేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68